# విహంగ మహిళా సాహిత్య పత్రిక ఏప్రెల్ సంచికకు స్వాగతం




ముఖ చిత్రం

డా.అరసిశ్రీ

విహంగ మహిళా సాహిత్య పత్రిక

(A Monthly Peer-Reviewed Online Telugu Journal)

ప్రచురణ : 01 -04 – 2025

ప్రతులకు: vihanga.com (Online only)

పబ్లిషర్స్ : Sri Mayuri FineArts Association

Rajamahendravaram, Andhra Pradesh, Iadia.

Cell: 8522967827, Email: editor.vihanga@com

సంపాదకులు :

మానస ఎండ్లూరి

డా.అరసి శ్రీ

సలహా మండలి:

★Prof.వెంకట రామయ్య గంపా,

Department of Modern Indian Languages & Literary Studies,

University of Delhi.

★డా.జ్యోత్స్న రాణి సవరం,

Assistant Professor , Sapthagiri Degree College,

Vijayawada.

★విజయభాను కోటే ,

Heutagogy Expert, Author, Poet, Translator

గమనిక: “విహంగ” పత్రికలోని రచనలలోని అభిప్రాయాలు రచయిత్రుల, రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి సంపాదకులు గానీ, పబ్లిషర్సు గానీ ఎలాంటి బాధ్యత వహించరు. “విహంగ” కేవలం అంతర్జాలపత్రికగా మాత్రమే ప్రచురితమౌతుంది. ఈ పత్రిక సంచికలు పుస్తకరూపంలో (ప్రింట్ ఫార్మేట్) లభించవు.

## సంపాదకీయం

సర్వేంద్రియాణం నయనం ప్రధానం – అరసి శ్రీ -4 –5

## కథలు

నేనెందుకు చచ్చిపోవాలి - శశి 6– 9
నా కథ – 4– దొర కోడె – దొంగ కోడె – డా.బొంద్యాలు బానోత్ (భరత్) 10– 15

## కవితలు

యుద్ధాలు లేని నేల – జయసుధ 16
ఉగాది కవితా లత – ఆర్.విజయశ్రీ 17
ఉగాది – గిరిప్రసాద్ చేలమల్లు 18
గాయాల గాయని ! – బాలాజీ పోతుల 19
అమ్మ కావడం గొప్ప వరం – బత్తుల రమ్య 20
తల ఎత్తిన తండ్రి – శ్రీలేఖ 21
గాజు పగుళ్ళ చప్పుడు .....? – పంపోతు నాగేశ్వరరావు 22–23
అబద్దపు నవ్వు – పాలేటి శ్రావణ్ కుమార్ 24
అంతర్జాల భూతం – ద్రావిడ హరి 25

## శీర్షికలు

అంతర్వీక్షణం – 3 –(ఆత్మకథ )–విజయభాను కోటే 26 – 30
యుద్ధం ప్రతికూలతల మధ్య ఉక్రెయిన్ భవిష్యత్తును రూపొందిస్తున్న ఇద్దరు మహిళలు(మహిళా మణులు ) – గబ్బిట దుర్గాప్రసాద్ 31 – 33
నేను ఎవరు ? –(సమకాలీనం )–బంగారురాజు 34 – 36

## పుస్తక సమీక్షలు

కవి జోసఫ్ అధిక్షేపించిన దశ పర్వాల – చెర్నాకోల శతకం –డా.ఆర్.శ్రీనివాసరావు 37 – 38

## ధారావాహికలు

జ్ఞాపకం–అంగులూరి అంజనీదేవి 39 – 41

## సాహిత్య సమావేశాలు

పద్మభూషణ్ బోయి భీమన్న జీవితం –సాహిత్యం జాతీయ సాహిత్య సదస్సు 42
సంస్కృతాంధ్ర నాటక సాహిత్యం – జాతీయ సదస్సు 43
మహాప్రస్థానం అమృతోత్సవం – మహా కవి శ్రీశ్రీ సాహిత్యం సమాలోచనం అంతర్జాతీయ సదస్సు 44
ప్రముఖ రచయిత్రి అనురాధ యలమర్తికు ఉగాది పురస్కారం 45

## “సర్వేంద్రియాణాం నయనం ప్రధానం”(సంపాదకీయం) –డా.అరసిశ్రీ

Posted on April 1, 2025 by vihangapatrika

“సర్వేంద్రియాణాం నయనం ప్రధానం” అంటే, అన్ని ఇంద్రియాలలో కన్నులు ప్రధానమైనవి అని అర్థం.

ప్రతి ఏడాది ఏప్రిల్ 1 నుండి 7వ తేదీ వరకు అంధత్వ నివారణ వారోత్సవాలను నిర్వహిస్తుంది మన కేంద్ర ప్రభుత్వం. . మంచి కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడం మరియు అంధత్వాన్ని నివారించడం యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన పెంచడం.

అంధత్వం నియంత్రణ కోసం జాతీయ కార్యక్రమం 1976లో ప్రారంభం అయింది. 2017 నుండి, అన్ని రకాల దృష్టి లోపాలను గురించి అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తుంది ప్రభుత్వం.

ప్రస్తుత జీవన శైలి , పరిస్థితులు కరోనా ముందు , తర్వాత అనడం సర్వసాధారణం అవుతుంది.కరోనా సమయంలో పాఠశాలలకు సెలవు ఇవ్వడం , అంతర్జాలంలో తరగతులు నిర్వహించడం వలన చిన్నారులు చరవాణి వినియోగం పెరిగిపోయింది.

ప్రస్తుతం పాఠశాలలు నిర్వహిస్తున్నా కూడా ఇళ్ళకు చేరిన తర్వాత విడియో గేమ్స్ , సాంఘిక మాధ్యమాలలో ఎక్కువ సమయం గడపడం జరుగుతుంది. వంద మంది పిల్లల్లో ఏడుగురికి ఈ లోపం ఉంటోంది. పిల్లలకు చిన్నప్పుడే దృష్టి లోపాలు వచ్చేందుకు పలు కారణాలు ఉంటాయి.

సరైన పోషకాహారం అందకపోవడం, ఎక్కువసేపు చీకటిగా లేదా మసక వెలుతురుగా ఉన్న గదుల్లో ఉండడం, ఎండ లేదా వెలుతురు తగిలేలా ఉండకపోవడం, టీవీలు, కంప్యూటర్లు, ట్యాబ్‌లు, ఫోన్ లు ఎక్కువగా ఉపయోగించడం దృష్టి లోపాలు వస్తుంటాయి. దృష్టి లోపం అంటే, కంటి చూపు సరిగా కనపడకపోవడం. సాధారణంగా దృష్టి లోపాలు 6 రకాలు.

★హ్రస్వదృష్టి : దగ్గరగా ఉన్న వస్తువులు మాత్రమే చూడగలరు, దూరంగా ఉన్న వస్తువులు చూడలేరు.

★దూర దృష్టి: దూరంగా ఉన్న వస్తువులు మాత్రమే చూడగలరు దగ్గరగా ఉన్న వాటిని చూడలేరు.

★చాత్వరము: దగ్గర మరియు దూరం ఉన్న వాటిని చూడలేరు.

★అసమ దృష్టి: వస్తువులు నిలువు గీతాలు అడ్డు గీతలు గా కనిపిస్తాయి.

★రేచికటి: రాత్రి సమయంలో వస్తువులు చూడలేరు.

★వర్ణ అంధత్వ: రంగులు గుర్తించలేరు

దృష్టి లోపాలు చాలా వరకు పోషకాహార లోపాల వల్లనే వస్తాయి. కనుక అన్ని విటమిన్లు, మినరల్స్ కలిగిన ఆహారాలను వారికి రోజూ ఇవ్వాలి. రోజూ అన్ని పోషకాలు కలిగిన ఆహారాలను ఇవ్వాలి. ముఖ్యంగా దృష్టి లోపాలు రాకుండా ఉండేందుకు గాను విటమిన్ ఎ ను అందించాల్సి ఉంటుంది. విటమిన్ ఎ ఎక్కువగా యాపిల్స్, కోడిగుడ్లు, టమాటాలు, నట్స్ వంటి ఆహారాల్లో లభిస్తుంది. అలాగే పాలను కూడా తాగించవచ్చు.

★పిల్లలు రోజూ కొంత సేపు అయినా సరే వెలుతురు లేదా ఎండలో గడిపేలా చూడాలి. ఫోన్లు, కంప్యూటరలన్ను ఎక్కువగా ఉపయోగించకుండా చూడాలి. తప్పనిసరిగా చరవాణి ఉపయోగిచాల్సి వస్తే మధ్య మధ్యలో విరామం ఇచ్చేలా ఏర్పాటు చేయాలి. టీవీలను కూడా ఎక్కువగా చూడకపోవడమే ఉత్తమం. పిల్లలకి ఒక వస్తువుగానీ, అక్షరాలుగానీ చూపించి వాటిని గుర్తించమని, చదవమని చెప్పాలి.

సాధారణ కంటి జబ్బులు:

- కండ్లకలక )Conjunctivitis):కంటి కనురెప్పల లోపలి పొర మరియు కంటి ఉపరితలం వాపు.
- కంటి శుక్లం )Cataract):కంటి లెన్స్ మసకబారడం.
- గ్లాకోమా )Glaucoma):కంటి లోపల ఒత్తిడి పెరగడం వల్ల కంటి నరాలకు నష్టం.
- కంటి పొరల వ్యాధి )Dry eye syndrome):కళ్ళు త్వరగా ఆరిపోవడం.
- రెటీనా డిటాచ్మెంట్ )Retinal Detachment):రెటీనా కంటి నుండి విడిపోవడం.
- మధుమేహం వల్ల కంటి జబ్బులు )Diabetic Retinopathy):మధుమేహం ఉన్నవారిలో కంటి రెటీనాకు వచ్చే నష్టం.

వయసు రీత్యా వచ్చే అంధత్వ సమస్యలు కన్నా పిల్లలలో అంధత్వ సమస్య ఎక్కువుగా ఉండటం గమనించవచ్చు. దీనికి ప్రధానా కారణాలు రెండు.అవి

1.ఆరోగ్య వంతమైన ఆహారం

2..ఆరోగ్యవంతమైన జీవన శైలి .రెండు లోపించడం.

మారుతున్న కాలంతో పాటు మనం కూడా మారాలి. కానీ మన జీవన శైలి మీద కాస్త అవగాహన ఉండటం ముఖ్యం. ప్రస్తుత రోజుల్లో తల్లిదండ్రులు పిల్లల ఏం చేస్తున్నారు అనే విషయాలపై గమనిస్తూ ఉండాలి. లేకపోతే పిల్లల కంటి చూపు పై తీవ్రమైన ప్రభావం చూపిస్తుంది.

చివరగా ఒక మాట పిల్లలు పెద్దల్నే అనుసరిస్తారు, అనుకరిస్తారు. కాబట్టి మనల్ని మనం కూడా ఒక్కోసారి తరిచి చూసుకోవాలి . అది ఈ విషయం అయినా ఏ విషయంలో నైనా కూడా, ఏమంటారు? ఈ విషయాన్ని గురించి ఒక్క సారి ఆలోచిస్తారు కదూ.

— అరసి శ్రీ

## నేనెందుకు చచ్చిపోవాలి(కథ)–శశి

Posted on April 2, 2025 by vihangapatrika

"సోఫాలో టవల్స్ ఏమిటి? ఇల్లంతా ఇంత చిరాగ్గా ఉంది పొద్దుట్నుంచి ఏం చేస్తున్నావ్? ఇల్లు నీట్ గా పెట్టుకోమని ఎన్నిసార్లు చెప్పాలి నీకు?"ఆఫీస్ నుంచి వస్తూనే చిరాకు పడిపోసాగాడు రఘు.

"అది కాదండి నాకు ఒంట్లో బాలేదు"నెమ్మదిగా చెప్పింది కీర్తన.

"ఏ ఏమొచ్చింది మాయిరోగం? ఎప్పుడు నస. పగలంతా పనిచేసే అలసిపోయి ఇంటికి వస్తే మనశ్శాంతి ఉండదు. మా ఆఫీస్ లో ఆడవాళ్ళు ఎంత హుషారుగా ఉంటారో! వాళ్లంతా ఇళ్లల్లో పనులు చేసుకొచ్చే వాళ్లే. నువ్వు కష్టపడన అవసరం లేకుండా, నేనే రెక్కలు ముక్కలు చేసుకుంటున్న ఇంకా ఏడుపు"

పొద్దుటి నుంచి హై ఫీవర్, జలుబు, దగ్గు, తలనొప్పి, ఒళ్ళు నొప్పులతో బాధపడుతూ, 'భర్త ఎప్పుడు వస్తాడా? డాక్టర్ దగ్గరికి తీసుకువెళ్తాడు. కనీసం మందు బిళ్ళయినా తెచ్చి పెడతాడు' .అని ఎదురుచూసిన, కీర్తన విరక్తిగా ఇంట్లో పనులు చేయడం మొదలు పెట్టింది. అలాగే ఓపిక చేసుకుని వంట, మిగిలిన పనులన్నీ పూర్తి చేసి భర్తకు భోజనం వడ్డించింది. కూరలో ఉప్పు తక్కువైందని తిడుతూనే భోజనం చేసి 'మాటవరసకైనా నువ్వు తిను', అని కానీ' ఒంట్లో ఎలా ఉంది మందు బిళ్ళ తీసుకురానా' అని కానీ, అడక్కుండానే వెళ్లి పడుకున్నాడు రఘు. వంటింట్లో పని పూర్తి చేసి బెడ్ రూమ్ లోకి వెళ్ళాలి అనిపించక కుర్చీలో కూర్చుని డైనింగ్ టేబుల్ మీద తల పెట్టుకునీ పడుకుంది. కన్నీళ్లు ఆగటం లేదు. జ్వరభారం బాగా ఉంది. అయినా వెళ్లి పడుకోవాలనిపించడం లేదు. తనమీద తనకే కసిగా కోపంగా ఉంది. పెళ్లయిన దగ్గర నుంచి రఘు ఇంతే.

పెళ్లిచూపుల్లో తెల్లగా అందంగా ఉన్నాడు, సాఫ్ట్వేర్ జాబ్, మంచి జీవితం ,అని తెగ మురిసిపోయింది. తాంబూలాలయ్యాక ఫోన్లో పొడిపొడిగా మాట్లాడుతుంటే మితభాషి అనుకుంది. 'జాబ్ చేయడం నాకు ఇష్టం లేద'ని చెప్పినప్పుడు, మొదటిసారి ఆలోచనలో పడింది."అలవాటు లేని వంట పని, ఇంటి పని సమర్ధించుకోవాలి. పైగా ఈ లోపు కడుపు, పిల్లలు, వాళ్ళ ఆలనా, పాలన. పిల్లలు స్కూల్కు వెళ్లడం మొదలుపెడితే కానీ నీకు కాస్త తీరిక దొరకదు. అప్పటికీ నీకు ఉద్యోగం చేయాలనిపిస్తే, అల్లుడ్ని ఒప్పించొచ్చులే. పెళ్లయిన వెంటనే ఉద్యోగం అంటే ఇంటా బయట సమర్ధించుకోలేక ఇబ్బంది పడతావు"అని తల్లి నచ్చ చెబితే సరిపెట్టుకుంది.

పెళ్లయి, రఘు ఉద్యోగం చేస్తున్న బెంగళూరులో కాపురం పెట్టాక," రఘులో ఉన్న పురుషాధిక్యత, ఆడవాళ్లంటే ఉన్న చిన్న చూపు" నెమ్మదిగా అర్థం అయ్యాయి.

మొదట్లో భర్తను మార్చుకోవాలని చాలా ప్రయత్నం చేసింది. కీర్తనకు విసుగు వచ్చిందే తప్ప, రఘులో కొంచెం కూడా మార్పు లేదు .పెళ్లయిన కొత్తలో ఒకసారి ప్రేమతో, ఇష్టంతో ,ఎంతో కష్టపడి, రఘు కి ఇష్టమైనవన్నీ వండి, తను వచ్చేసరికి ఇల్లంతా సర్ది, తాను చక్కగా తయారై, భోజనం వడ్డించినా ,"మా అమ్మయితే ఈ కూర

ఇంకా బాగా చేస్తుంది. పప్పులో పోపు పైకి కనిపిస్తే బాగుంటుంది" అంటూ సలహాలు ఇచ్చాడు.
"మీకోసమే కష్టపడి చేశాను బాగుందని ఒక్క మాట చెప్పొచ్చుగా"అంటే

"నువ్వు విమర్శలు తీసుకోలేవు. తప్పులేమిటో చెప్తేనే కదా, వాటిని సరి చేసుకుని, రేపు ఇంకా బాగా చేయగలవు. అయినా నిన్ను పొగడటమే నా పని అనుకున్నావా? పొగడ్తలే కావాలంటే, బాగా పొగిడే వాడినే చూసుకుని పెళ్లి చేసుకోవాల్సింది" అంటూ బెడ్ రూమ్ లోకి వెళ్లిపోయాడు.
నిశ్చేష్టురాలై నిలబడిపోయింది కీర్తన. ఆరోజు భోజనం కూడా చేయకుండా చాలా సేపు ఏడ్చింది. ఆ ఒక్కరోజే కాదు, ఆ ఒక్క సందర్భమే కాదు, చాలా సందర్భాల్లో ఏడుస్తూనే ఉంది. కోపం విసుగు వచ్చి, ఎప్పుడైనా రఘుని ఎదిరిస్తే "నా ఇంట్లోనే ఉంటూ, నా తిండి తింటూ, నన్నే నిలదీస్తావా ?"లాంటి మాటలకు జీవం లేని శవమై అవుతొంది కీర్తన.

ఇంట్లో ఎంత పని చేసినా, ఎంత బాగా వంట చేసినా, ఎంత చక్కగా తయారైన ,ఏదో ఒక వంక పెట్టి, తీసి పడేసినట్టుగా మాట్లాడతాడే తప్ప, "బాగుంది "అన్న ఒక్క మాట, అస్సలు అనడు.
తల్లిదండ్రులు ఫోన్ చేసినా, "కీర్తనా ! అల్లుడుగారు ఎలా ఉన్నారు? టిఫిన్ చేసి వెళ్ళారా ఆఫీస్ కి ?లంచ్ బాక్స్ ఇచ్చావా? వంటలు కుదురుతున్నాయా? ఉప్పుకారాలు ఎక్కువ తక్కువ వేసి ఇబ్బంది పెట్టట్లేదు కదా?" అంటారే తప్ప,

"నువ్వెలా ఉన్నావు? అలవాటు లేని వంట చేయగలుగుతున్నావా? ఇబ్బంది పడుతున్నావా? అల్లుడుగారు బాగా చూసుకుంటున్నారా?"అని మాటవరసకి కూడా అడగరు.
తనే "విసుక్కుంటున్నాడు, ప్రతిదానిలో తప్పులు వెతుకుతున్నాడు". అని చెప్పినా,

"ఒక్కొక్కళ్ళ స్వభావం ఒక్కోలా ఉంటుంది. నెమ్మదిగా తెలుసుకుంటాడు లే ,బయట చాలామంది మందు, సిగరెట్లు, అమ్మాయిలని చెడు వ్యసనాల్లో పడి, ఇల్లు గుల్ల చేస్తుంటారు. పెళ్ళాల్ని కొడతారు ,చిత్రహింసలు పెడతారు. కానీ మన రఘు కి అలాంటి అలవాట్లు ఏమీ లేవు .మాట కరుకు గానీ, రఘు బంగారం" అంటూ అల్లుడ్ని పొగుడుతారు.

రోజురోజుకీ జీవితం మీద ఆసక్తి తగ్గిపోయి విసుకు విరక్తి పెరగసాగాయి.
చాలాసార్లు చనిపోవాలనుకుంది కానీ ధైర్యం చాలలేదు.
కానీ ఈరోజు తనకి ఒంట్లో బాగోకపోయినా, తన చేత పని చేయించుకుని, కనీసం తన స్థితిని పట్టించుకోకుండా నిద్రపోతున్న భర్త. తన బాధ ఇది అని చెప్పి నోరు తెరిచి చెప్పినా అర్థం చేసుకోని తల్లిదండ్రులు . అసలు ఈ లోకంలో తన గురించి ఆలోచించే వాళ్ళు కానీ ,తనకి ప్రేమను ఆప్యాయతను పంచేవారు గానీ ,ఎవ్వరు లేరు అనిపించింది.

తెలియని ఆవేశం పూనింది కీర్తనకు. తను వేసుకున్న చున్నీ తీసుకుని, డైనింగ్ టేబుల్ పక్కకి జరిపి, కుర్చీ వేసుకుని ,కుర్చీ ఎక్కి, ఫ్యాన్ కి చున్ని ఒకవైపు గట్టిగా ముడివేసింది. రెండోవైపు చున్నీని తన మెడకు

బిగించుకుని కూర్చీని తన్నేసింది.
అంతకుముందే డైనింగ్ టేబుల్ జరిపిన చప్పుడికి మెలకువ వచ్చి, కీర్తన ను తిట్టుకుంటున్న రఘు. ఇప్పుడు కుర్చీపడిన శబ్దానికి కోపంతో కీర్తనను తిట్టాలని డైనింగ్ హాల్ లోకి వచ్చి, ఎదురుగా కీర్తన ఫ్యాన్ కి వేలాడుతూ గిలగిలలాడటం చూసి, ఒక్క క్షణం నిశ్చేష్టుడయ్యాడు. వెంటనే తేరుకుని, పరుగు పరుగున కీర్తన దగ్గరికి వచ్చి, కింద పడిన కుర్చీని లేపి, కీర్తనను దానిపై నిలబెట్టి, పక్కనే మరో కుర్చీ వేసుకుని, కీర్తన మెడకి ఉన్న చున్నీ లాగేసాడు.

కీర్తన కిందకు దిగి గొంతు పట్టుకుని దగ్గుతూ కుర్చీలో కూర్చుంది.
రఘు" కీర్తనా !ఇప్పుడు నీకు చచ్చేంత కష్టం ఏమీ వచ్చింది? హాయిగా ఇంట్లో తిని కూర్చోలేక, ఎదవ ఏడుపులు ,ఎదవ గోలలు, నేనేదో నిన్ను టార్చర్ పెడుతున్నట్లు లోకానికి చెప్పాలని అనుకుంటున్నావా? ఉండాలనుకుంటే ఇంట్లో ఉండు, లేకపోతే నీ పుట్టింటికి వెళ్ళిపో .అంతేగాని నువ్వు చావకు ,నన్ను చంపకు," అంటూ కీర్తన చేయి పట్టుకుని బలవంతంగా బెడ్ రూమ్ లోకి తీసుకువెళ్లి "నోరు మూసుకుని పడుకో" అని తను వేరే వైపు తిరిగి పడుకున్నాడు.

మంచం మీద కూలబడిన కీర్తనకు, కన్నీళ్లు ఆగటం లేదు. ఆలోచనలు ఆగటం లేదు.
"ఇప్పుడు రఘురావటం ఆలస్యం అయితే, తాను చనిపోయి ఉంటే, రఘు' ఇది చచ్చి నన్ను ఇబ్బంది పెట్టింది' అని తిట్టుకుంటాడేమో ?'ఆఫీస్ కి సెలవులు వేస్ట్ అయ్యాయని' బాధపడతాడేమో"?

అమ్మ వాళ్లు ,అత్తగారు వాళ్ళు," శుభ్రంగా కాపురం చేసుకోకుండా, పిచ్చితనంగా ప్రాణాలు తీసుకుని, మా పరువు తీసేసింది" అనుకుంటారేమో?
అసలు నేను చచ్చిపోతే ఎవరైనా బాధపడతారా? మరి వీళ్ళ అందరి కోసం నేను ఎందుకు చచ్చిపోవాలి?" అని అనుకుని కళ్ళు గట్టిగా తుడుచుకుని టైం చూస్తుంది రాత్రి వంటి గంట . గడియారం ముళ్ళు తిరుగుతోంది తప్ప, నిద్ర మాత్రం రావటం లేదు. రఘు హాయిగా నిద్రపోతున్నాడు.

తెల్లారి ఏమీ ఎరగనట్టు ఆఫీస్ కి వెళ్ళిపోయాడు రఘు. కీర్తన ఒక దృఢ నిశ్చయానికి వచ్చి,తనబట్టలు, వస్తువులు సర్దుకుని ఇంటి తాళం పక్కింట్లో ఇచ్చి , ట్రైన్ ఎక్కి ముంబైలో ఫ్యాషన్ డిజైనర్ గా పనిచేస్తున్న తన ఫ్రెండ్ మౌనిక దగ్గరికి వెళ్ళింది. విషయమంతా విన్న మౌనిక, "కీర్తన మంచి పని చేసావ్. మనకి గౌరవం, మనమంటే ప్రేమా, లేని చోట మనం ఉండకూడదు. నీకు గుర్తుందా? మనం చాలా ఇష్టపడి ఇంట్లో పెద్దల్ని ఒప్పించి మరీ ,ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులో చేరాం. ఎంత ఆక్టివ్ గా ఉండే దానివి నువ్వు. పైగా మన కాలేజీకి ఫస్ట్ .ఇప్పుడు నీ వాలకం చూస్తుంటే ,అప్పటి నా ఫ్రెండ్ కీర్తనవేనా ?అనిపిస్తోంది. మూర్ఖత్వంగా ఆలోచించి, బాధలు పడుతూ అక్కడే ఉండిపోకుండా, ఏ అఘాయిత్యానికి పాల్పడకుండా, సరైన నిర్ణయం తీసుకున్నావ్ .మా ఆఫీస్ లోనే ఒక పోస్ట్ ఒకటి కాళీ ఉంది చేరుదువు .నీ మనసు కొంచెం కుదుటపడ్డాక, ఏం చేయాలో నిర్ణయం తీసుకుంది గాని" అంది.

ఆ మాటలకి కాస్త తేరుకున్న కీర్తన, తల్లికి ఫోన్ చేసి తను ఇంట్లోంచి వచ్చేసిన విషయం చెప్పింది. తల్లి కంగారుపడి"కీర్తన ఎంత పని చేసావ్? ఎందుకిలా చేశావు? భర్తను వదిలేసిన ఆడవాళ్ళని సంఘం చాలా చిన్న చూపుతో చూస్తుంది. నాన్న నేను ఈ పూట బెంగళూరు బయలుదేరుతాం. నువ్వు కూడా రా. అల్లుడుగారు కాళ్లు పట్టుకునయినా నిన్ను మళ్ళీ ఏలుకోమని బతిమాలుతాం"అంది.

"అమ్మ! నేను ఇక నేను రఘు తో కలిసి బతకలేను. ఆడదాన్ని ఒక పనిమనిషి కన్నా హీనంగా చూసే చోట నేనే కాదు ఏ ఆడపిల్ల కూడా బతకలేదు. పుట్టి పెరిగిన వాతావరణం, తల్లిదండ్రులని, అక్క చెల్లెల్ని, అన్నదమ్ముల్ని, అందరిని ,అన్నిటిని ,వదిలి అత్తారింట్లో అడుగు పెట్టే ఆడపిల్లకి, ఆ ఇంట్లో కలిసిపోయేలా ప్రేమాభిమానాలు స్వేచ్ఛ ఇవ్వాలి . తెలిసొ ,తెలియకో చేసే చిన్న చిన్న పొరపాట్లను ప్రేమతో సరి చేయాలి. అంతేకానీ అధికారం ఉంది కదా అని, తన ముందే, తనని, తన పనులని ,తన పుట్టింటి వారిని, తక్కువ చేసి మాట్లాడటం, ఏం చేసినా వంకలు పెట్టడం, వలన ఆడపిల్ల ఎంత మానసిక క్షోభకు గురవుతుందో తెలుసా? అసలు మనస్ఫూర్తిగా వాళ్లతో కలవగలదా? ఆడపిల్లకి కొన్ని ఇష్టాఇష్టాలు ఆశలు కోరికలు ఉంటాయని మరిచి,' ఒక మర బొమ్మల ఇంటిదు చాకిరీ చేస్తూ, పిల్లల్ని కంటూ బతికేయి. ఇదే నీ జీవితం' అనటం, ఎంతవరకు సమంజసం? నేను చదువుకున్నాను. నా కాళ్ళ మీద నేను నిలబడగలను. పెళ్లే జీవితానికి పరమావధికాదు. రఘుకు విడాకులు ఇచ్చేస్తాను. తర్వాత సంగతి నెమ్మదిగా ఆలోచిద్దాం" అని మరో మాటకు అవకాశం ఇవ్వకుండా, ఫోన్ పెట్టేసింది కీర్తన.

**–శశి,**

~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~
~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~

## నా కథ-4 దొర కోడే-దొంగ కోడే —— డా.బోంద్యాలు బానోత్(భరత్)

Posted on April 1, 2025 by vihangapatrika

బాగ వర్షంకురిసి, వెలిసింది. అప్పటి దాకా పెద్ద మర్రి చెట్టుకింద వర్షానికి తలదాచుకున్న గొర్లు, ఒల్లు దులుపరింకుంటూ, ఆ చెట్టు కింది నుండి మెల్లగా పచ్చికబీడులోకి వెళ్ళుతున్నాయి. ఆకాశంలో పనవటిమొఖాన సింగిడి పొడిసింది. వాతావరణం తేటగ ఉంది. మేము వానకోటు/వాన జాబు మడతపెడుతున్నం. నేను నా వానజాబును చిన్నగా, మంచిగా మాడతపెడుతూ..మా దంటగానికి ఒక కొస పట్టకోమన్నాను.." ఏ...ఏ... దాన్నేమో సుతారంగ మడత పెట్టబడితివి.. .

ఎట్టోకట్టా మడతపెట్టీ, ఆ సుతిల్దారంతో గుంజ్జికడితే, అదే వుండే దానికి ఇంత సేపా..!?, రెండు-మూడు గం.ల నుండి వర్షం కారణంగా ఇయ్యాల, అవీ సరింగా మేత మెయ్యలేదు. ఆకలి మంటకు ఒక్కసారి దులుపరించి ఉరికినయంటే..!, ఇక చేతికి దొరకవు, జల్దీజల్దీ గాని ...! , జీతమంటూ.. ఉంటే పరాయోనికే వుండాలే, అంటే గా ఊల్య/ఊర్లో ఎవడికైనా ఉండాలే.. కాని అయినవాడికీ/ కులపోడికీ/ పాలోడికీ/సుట్టపోడకీ.. జీతముండొద్దు, ఎందుకంటే, వాడొకమాటన్నా ఏమనిపించదు, ఎందుకంటే వాడెవ్వడో..! మనమెవ్వలమో..అంతగా మనసునొయ్యదు. అదే మనోడన్నాడనుకో..! 'ఎందుకురా..! ఈ జీవితం' అనిపిస్తది.." అన్నాడు మా దంటగాడు. "అరే..! ఇంకేమయింది రా..! అంతగనంగా బాదపడుతున్నావు." అని నేనడిగాను." అరే..!ఇంకేంగావాల్రా..! . అయిన్దానికి, కాన్దానికి, చిన్న -చిన్న విషయాలకి... ఎట్లబడితే -అట్ల మాటలనడం.. ఎవల్బద్దరు.. బై..!? ఎడ్లకు గడ్డి సరిపోను వెయ్యమంటారు.. తెల్లారి ఎడ్ల కాల్లకింద తొక్కుడు గడ్డుంటే, 'ఆ తిక్కల్దీ తిడుతది', దానికి ఈయనకూడా వత్తాసు పలుకుతూ, 'తినేయంత వెయ్యమన్నా.. గాని, తొక్కేయంత వెయ్యమన్నా నా..!?' అంటడు. అరే.. అవీ పశువులు, తింటావుంటే కచ్చితంగా ఎంతోకొంత తొక్కుతాఏయి.. ఆ చిన్న విషయం తెలియదా?" అన్నాడు.. బాధపడుతూ. " అరే..నువ్వేంద్రబై.. ఉల్టా..వచ్చినవు..!'అందరూ తండా నుండి ఊల్లోల్లకు జీతముంటారు. కాని నువ్వు ఉల్లాసంగా ఊల్లోవున్నోడివీ తండాకొచ్చి జీతమున్నవు. అదికూడా,అందరూ ఉగాది నుండి ఉగాది వరకు ఉంటారూ, కాని నువ్వు ఉగాది నుండి దసరావరకు ఒకచోట, మల్లి దసరా నుండి ఉగాది వరకు ఇంకోచోట..! అదీ కూడా పోయి పోయి ఆ బోకరోని దగ్గర..! రోజుకు ఎన్ని అబద్దాలాడతడో..వానికే గుర్తుండదు." అన్నాడు, జాబును జాగ్రత్తగా మడతపెడుతూ.

" అరే..! బై 'దూరపు కొండలు నునుపు' అని ఎందుకంటారో..!? నాకిప్పుడు అర్థమయింది రా.." అన్నాను నేను. "అరె.. అదేంటి..!? అట్లంటావు.." అన్నాడు మా దంటగాడు. " అట్లనకపోతే..! ఇంకెట్లంటారు..!? జీతమెక్కడున్నా, అది జీతమే. వీడు-వాడాని భేదం లేదు. జీతముండేటోడు, జీతముంచ్చుకునేటోడూ.., లేనోడు.., ఉన్నోడు.. అంతే తేడా" అన్నాను నేను. "అరే.. ఇంత కచ్చితంగా, వాస్తవాలు.. చెప్పుతున్నావంటే, నువ్వు మధ్యలోనే, ఆ దొరగాడి జీతం వదిలేసి రావడానికి వెనకాల 'పెద్ద కథే' ఉన్నట్టున్నది. ఐతే నాకు ఆ 'కథ'

చెప్పవా..? ఎందుకంటే..!? నేను కూడా వచ్చె ఉగాది నుండి ఊళ్ళో జీతముండాలని, అనుకుంటున్నాను." అన్నాడు మా దంటగాడు.

" అరే..నూవింతగనం అడుగుతుంటే నీకు చెప్పక పోతే, ఇంకెవరికి చెప్పుత బై...? మన బాధలు మనం–మనం, చెప్పుకోక తప్పదు.." అన్నాను.

"..ఐతే, మా ఇంట్లో మూఢనమ్మకాలు ఎక్కువ. మా పెదనాన్నకూ మంత్రాలొస్తాయని పుకారు. అందువలన అతనికి తండావాళ్ళు భయపడే వారు. మా అమ్మ–నాన్నకు కూడా ఆ భయముండేది. ఈ విషయం ఆయనకు కూడా తెలిసుంటది. అందుకే దానికి తగినట్టుగానే ప్రవర్తించేవాడు. ఒక రోజు ఆయన 'బాగ తాగి', నన్ను భయపెట్టి, నీ కొడుకు నా మాట వినలేదని, మా అమ్మ – నాన్నలను భయపెట్టి, మా ఇంటి మీదికొచ్చి గొడవ చేసి "వాని సంగతి నేను చూస్తా..", అని అన్నాడు. ఐతే, నాకేమయిన చేతబడి, మంత్రాలు; చేస్తాడేమోనని భయపడి, నన్ను బడి మాన్పించి, 'కోరెం సంజీవ రెడ్డి'కి రెండు సంవత్సరాలు జీతముంచి, అప్పు తెచ్చాడు. రెండు సంవత్సరాల తర్వాత, ఆ పాత అప్పు తీర్చడానికి, 'గౌరీ కేదారి' వద్దా కొత్త అప్పు చేశాడు. ఇంకో రెండు సంవత్సరాల తర్వాత, ఈ పాత అప్పుతీర్చడానికీ, మల్లి దొర 'యాకుబ్ రెడ్డి' వద్ద జీతం ముంచి, కొత్త అప్పు తెచ్చాడూ.

మా దొర 'సంది యాకుబ్ రెడ్డి', ఆయన తండ్రి పేరు 'సంది నారాయణ రెడ్డి' , ఈయన మా ఊరికి దొర. ఈయనకు ముగ్గురు కొడుకులు. పెద్దాయన 'సింది క్రిష్ణా రెడ్డి', పడిపాయన పేరు 'సింది యాకుబ్ రెడ్డి', చిన్నోడి పెరు 'సింది బుచ్చిరెడ్డి'. వీళ్ళు ముగ్గురూ దొరలు. మా ఊరికి నాలుగు వైపులా వీళ్ళ భూములే ఉండేవి. వీళ్ళ తర్వాత 'రావుల నర్సమ్మ' కు కూడా భూమి బాగానే ఉండేది. ఆ తర్వాత ప్రతి రెడ్డి కుటుంబానికి పదెకరాలకు పైయిన్నే ఉన్నది. కాని వీళ్ళందరూ 'కాపులుగా' కూడా పిలువబడేవారు.

ఐతే ఆ ముగ్గురిలో 'యాకుబ్ రెడ్డి' 'దొర', కూ మంచిపెరున్నది. ఇంతో– అంతో చదువుకున్న వ్యక్తి. ఈయనకు ఇద్దరు భార్యలు. ఎందుకో కానీ పెద్దామె ఈయనతోటి ఉండేది కాదు. రెండో ఆమె 'రాణెమ్మ దొరసాని'తో ఊళ్ళో వుండేవాడు. వీళ్ళకి నాకు తెలిసిన వరకు ముగ్గురు అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలు. వీళ్ళందరూ హనుమకొండలో ఉండి చదువుకునేవారు. పెద్దకొడుకు 'రణధీర్ రెడ్డి' సెలవుల్లో ఇంటికొచ్చేవాడు. అందరికంటే చిన్నోడు చిన్నకొడుకు. ఇంటి వద్దే వుండేవాడు.

నేను కొత్తగా ఉగాది నుండి జీతం పనిలోకి పోయాను. నాది 'తిండిజీతం' అంటే వాళ్ళింట్లోనే తినాలే, రాత్రింబవళ్ళు వాళ్ళ ఇంటికాడనే వుండాలి. ఆరోజుల్లో 'దొర' దగ్గర జీతమంటే ఆ సమాజంలో కాసింత గౌరవం ఉండేది. తిండిజీతం కాబట్టీ బైయట పనులు, ఇంట్లో పనులు; ఊడవడం, చల్లడం, బొల్లుతోమడం, మంచినీళ్ళు, ఉప్పునీళ్లు, అవసరమైతే వంటవండటం, పశువుల పెండతీయడం, మేతేయడం, గోబర్ గ్యాస్ లో పెండ కలిపి పోయడం, ... మొదలగు పనులన్నీ నేనే చేసేవాణ్ణి.

ఐతే, ఉగాది నుండి ఎండాకాలం మొదలైంది. బడి పిల్లలకు సెలవులు కావడంతో వాళ్ళ పిల్లలందరూ ఇంటికీ వచ్చి ఉన్నారు. అప్పుడు నేను వాళ్ళకు, వాళ్ళు నాకు కొత్తే. ఆ సమయంలో పదీ–ఇరవై రోజులు ఇంటివద్దనే వున్నారు. సాయంత్రమైతే ఇంటి ముందు దుమ్ము లేవకుండా పలచగా నీళ్ళు చల్లీ, ఊడ్చీ మంచాలు వేసీ, వాటిమీద దుప్పట్లూ, దిండ్లు వేసేవాడిని. అప్పుడు ఆ పిల్లలందరూ వచ్చీ, ఆ మంచాలపైన కూర్చోవడం, ఒరగడం, పడుకోవడం తమకు నచ్చినట్లుగా వుండేవారు. మా దొర, దొరసాని కూడా మాట్లాడుతూ కూర్చోనేవారు. నేను వాళ్ళకు దగ్గరలోనే దర్వాజ మెట్లమీద కూర్చునే వాణ్ణి. ఆ పిల్లలకు ఏదైన అవసరమై పిలుస్తే, నేను వెంటనే ఆపనిచేసిపెట్టేవాణ్ణి. సరిగ్గా గుర్తులేదు, కాని వాళ్ళు ముగ్గురో, నలుగురో అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలు ఉండేవారు. వాళ్ళ మధ్య ఒకటీ లేదా రెండు సంవత్సరాల గ్యాప్ మాత్రమే ఉన్నట్టు కనిపించేది. వాళ్ళు మాట్లాడుకుంటూ, మధ్య మధ్యలో 'ఇంగ్లీష్ ' పదాలు ప్రయోగించేవారు. నేను ఆ ఇంగ్లీష్ పదాలను శ్రద్ధగా వినేవాణ్ణి. వాళ్ళకూ నా పేరు 'బొంద్యాలు బాణోత్' అని సరిగ్గా పలకడం రాకపోయేది. అందువల్లా " అరె ఈ రోజు నుండి నీ పేరు 'రాము' . నిన్ను ఈరోజు నుండి 'రాము' అని పిలుస్తాము" అని అన్నాడు మా దొర. "సరే దొర" అన్నాను. ఆ రోజునుండి ఆ పిల్లలందరూ నన్ను 'రాము' అని పిలిచేవారు.

పెద్ద కొడుకు 'రణధీర్ రెడ్డి' నీ జీతగాళ్ళు అందరు చిన్న 'దొర' అని పిలిచేవాళ్ళు. అక్కడిదాకా ఎందుకు? అందరికంటే చిన్న కొడుకు ఐదుసంవత్సరాలుంటాడు, ఆయనను కూడా 'చిన్న దొర' అనే పలకరించేవారు.వాళ్ళ నాన్న వయస్సున్న వాళ్ళు కూడా ఆ చిన్న పిల్లోడిని 'చిన్నదొర' అని పలకరించేవారు. నాకు కొంచెం విడ్డూరంగానే అనిపించేది. ఎందుకంటే ?ఇతని వయసెక్కడా..!? వాళ్ళ వయసెక్కడా..!? అని అనిపించేది. ఐతే నేను, 'రణధీర్ రెడ్డి' మేమిద్దరం సమవయస్కుల్లా అనిపించే వాళ్ళం. నేను కూడా 'చిన్న దొర' అనే పిలిచేవాణ్ణీ. అతను సైకీలు తొక్కడం నేర్చుకునేందుకు చిన్న సైకిల్ కిరాయికి తెచ్చేవాడు. తొక్కడం ప్రాక్టీస్ చేసేవాడు. అప్పుడప్పుడు నాకు కూడా ఇచ్చేవాడు. నేను కూడా సైకిల్ తొక్కడం ప్రాక్టీస్ చేసేవాణ్ణీ.

చూస్తూండగానే రోజులు గడిచినయి. వార్షాకాలం మొదలయింది. బడులు ప్రారంభమయినయి. పిల్లలందరూ బడికి 'హన్మకొండ'కు వెళ్లి పోయారు.

ఐతే, ఉగాది నుండి విత్తనాలు వేసేంతవరకు పశువులను మేపడమంతా సుఖం ఇంకోటి వుండదు అనిపిస్తుంది. ఇంటికాడ వదులుతే, సర్వలకుంటనుండీ మేసుకుంటూ మా పటేలోల్ల బయికాడా కల్లంపొల్లు వగైరా మేసి.. బాగా ఎండ కొట్టే సమయాన బలిజోల్ల మామిడి తోటలో చెట్లకింద నీడకు పశువులన్నీ హాయిగా పడుకునేటివి. మేము కూడా మధ్యాహ్నం అన్నం తిని, ఆ చెట్లకింద ఆడుకునే వాళ్ళం, బావుల్లో ఈత కొట్టేవాళ్ళం, అవసరమైతే కాసేపు పడుకునే వాళ్ళం. మల్లి పొద్దుగుంజాముల మూడు నుండి నాలుగు గంటల సమయాన, పశువులు వాటికవ్వే లేసి మడికట్లల్లో మేయడానికి బయలుదేరేవి. మేము కూడా వాటి వెనకాల తిరుగుతూ, పొద్దు బూకే సమయానికి ఇంటికి తోలుకోని పోయి, కట్టేసి, మేతేసి, మిగతా పనులు చూసుకునే వాళ్ళం.. .

ఐతే, ఈ 'యాకుబ్ రెడ్డి దొర' నలుగురి నుండి ఐదుగురు మనుజులవరకు జీతంలో పెట్టుకునేవాడు. పశువుల కాపరికీ ఒకరు, గొర్ల కాపరికీ ఒకరు, వ్యవసాయానికీ ముగ్గురు మొత్తం ఐదుగురు జీతగాన్లను పెట్టుకునే వాడు. ఇందులో 'శాలోల్ల యాలాద్రీ' చాలా సంవత్సరాలుగా ఈ దొర వద్దనే జీతము ఉంటున్నాడు. ఓఇద్దరు మా తండా వాళ్ళు ఉండేవాళ్ళు. ఐతే ఈ సంవత్సరం మా తండా నుండి బీచ్య(వ్యాండో బీచ్య) ఉన్నాడు. అతను ఇంటికీ వచ్చేవాడు, అవసరమైతే బాయికాడికీ పోయేవాడు. నన్ను ఇక్కడ జీతముంచాలని అనుకున్నప్పుడు, మా నాన్న దొరింటికాడి తిండీ–తిప్పలు, సాదక–బాదకాల గురించి ఈ 'బీచ్య' నే అడిగి తెలుసుకున్నాడు. " అచారేర్ ఖ్వాడి ఘంఘం గందావ, అంబార్ ఆచార్, లింబూర్ ఆచార్, అమొళ్యార్ ఆచార్..., ఓ కాయిఁఖావజకో తోన ఘాలఛ..కత్ మళఛ తోన..!?, ఖా ఖాన్ తీన్మీనార్ మాయిఁ, అంబార్ సరీకో, అత్రాజాడో వేజాచీ.. దేఖ్...మార్వాత్ లబ్బారి..వతో.." అని అన్నాడు పెద్దజీతగాడు 'బీచ్య'. దొరల ఇంట్లో అట్లానే ఉంటుంది కావచ్చు అని అనుకున్నాను. అది వినీ మా నాన్న కూడా సంతోష పడ్డాడు. సంవత్సరం వరకు నాకొడుక్కూ తిండికీ, ఉండడానికీ రంధీ లేదు అని అనుకున్నాడు.

'మనుబోతుల కొంరయ్యా' గొర్ల కాపరిగా ఉండే వాడు. వాడు కేవలం గొర్లవరకు మాత్రమే చూసుకునే వాడు. కాని ఎండాకాలంలో నిళ్ళు ఎక్కువ పట్టడంతో, మాతోపాటు 'కొంరయ్య' కూడా నీళ్ళకు వచ్చేవాడు.

ఐతే, ఈ 'యాలాద్రి' ఊళ్ళోవాడు కావడం వలన ఏ సమయానికైనా అందుబాటులో ఉండేవాడు. రాత్రైన, పగలైన.. ఎక్కువ సమయం దొరింటి వద్దనే ఉండేవాడు. పొద్దుగాల చీకట్లోనే వచ్చీ పాలు పిండి దొరసానికిచ్చేవాడు. రాత్రి పూట కల్లాలవద్దా కావలుండేవాడు. ఎప్పుడైనా 'దొర కుటుంబం' ఊరికి పోతే, ఇల్లంతా ఈ 'యాలాద్రి' మీద వదిలేసి పొయేవారు. అంటే అంత నమ్మకం ఉండేదన్నమాట.

ఇక తిండీ విషయానికొస్తే.. జీతంలో చేరిన నాటినుండి రెండు నెలల వరకు అంతో–ఇంతో, రాత్రిదో–పగలుదో, తొక్కో–పులుసో..పెట్టేది మా దొరసాని. కాని ప్రతిసారి భోజనంలో మామిడి కాయతొక్కు వేసేది. దాంతో కడుపులో మంటేసేది. కాని అది 'ప్రతిపూట మామిడి కాయ పచ్చడి' తినడం వల్లనే కడుపులో మంటవుతుందన్నా విషయం నాకు తెలియదు.

రెండు నెలల తర్వాత, వంటింట్లో గ్యాస్ పొయ్యిని వాడే విధానం, దానిమీద వంట వండే విధానం.. మొదలగు విషయాలు నేర్పించింది మా దొరసాని. "అరే..! 'రాము' ఈ రోజు నుండి నీమందము నువ్వు ఇందులో వండుకో. మా మందం మూడు గ్లాసుల బియ్యం ఈ గిన్నేలో వండు.. అర్థమయిందా ర..!?, ఉల్లి గడ్డలు, కూరగాయలు కోసేయ్యి, నేను కూర వండుత" అని అన్నది మా దొరసాని. నేను ఏమి అనలేక అవునన్నట్లుగా తలూపాను. తర్వాత రోజునుండి నా అన్నం నేనే వండుకున్నాను. వాళ్ళకు కూడా 'అన్నం' నేనే వుండేవాడిని. ఏరోజుకారోజు కూరగాయలు కోయమని ఇచ్చేది, వాటిని నేను కోసిచ్చేవాడిని. కూరలు మాత్రం మా దొరసానే వండేది.

ఐతే, రోజు తోమినట్లే, ఆరోజు కూడా బొళ్ళుతోముతున్నాను. కూరగిన్నె తోమడానికి చేతికి తీసుకోని తోమపోతే అందులో ఒక మనిషికి సరిపడా 'మటన్ షోర్వా, ఓ రెండు–మూడు మటన్ ముక్కలు, ఓ రెండు బొక్కలు' పడేసి వున్నాయి. అవి చూసి 'నేను బాధపడ్డాను. ఎందుకంటే ఈ విధంగా, వృధాగా పడేసే బదులు నాకేసిన తినేవాడిని కదా..! రోజు మూడు పూటలు ఆ మామిడికాయ పచ్చడి, అప్పుడప్పుడూ రాత్రి మిగిలిన (చలికూర).. తినీ బోర్ కొడుతోంది.'అని అనిపించింది...ఈ విధంగా ఓ రెండు–మూడు నెలలు గడిచింది.

ఒక రోజు పశువులను తోలుకోని ఇంటికి వచ్చాను. వాటిని కట్టేసి, మేతేసి ఇంటికి పోయేసరికి, ఇంటికి తాళమేసి ఉంది. దొరసాని ఇంట్లో కనబడుత లేదు, దొర కూడా కనబడుత లేదు. పొద్దుకి చీకటి కావస్తోంది.. నేను ఇంటిముందు తాళం వేసియున్న ఆ దర్వాజ వైపు చూస్తూండగా.. "అరె..! ఓ పిలగా..! ఇట్రా.." అని అన్నాడు నాగటేడ్లకు మేతేసుకుంటూ 'యాలాద్రి'. ఐతే, నేను అతని దగ్గరికి పోయాను. "ఈ రోజునుండి మీ దొరసాని వచ్చేంతవరకు నువ్వు మా ఇంటివద్దనే బువ్వతినాలి, అర్థమయిందా..!? వాడిచ్చే ఆతులపొట్టూకు, వానికి చేసింది చాలకా, ఇంకా, ఇప్పుడు నీకు కూడా మేమే చెయ్యాలే..! నిన్నంటే ఏమి లాభం, నిన్న–మొన్నొచ్చినోడివి, నీకు మాత్రం ఏమి తెలుసు, మా కష్టాలు. నేను, నా భార్య సంవత్సరాల తరబడి, రాత్రింబవళ్ళు కష్టపడి పని చేసినా..మా బతుకులు మాత్రం మారలేదు...సరే ఇవ్వన్నీ నీతో చెప్పుకుంటుంటే వచ్చేదీ లేదు పోయేదీ లేదు. ఐతేమాయే గాని, నీకూ మా ఇల్లు తెలుసా..!? నాతో రా.. ఇద్దరం పోయి, ఇంత తినీ మల్లొదం." అని అన్నాడు 'యాలాద్రి'.

ఇక ఆ రోజునుండి, రోజు అన్ని పనులు చేసుకోని బువ్యాల్లకు 'యాలాద్రి' వాళ్ళ ఇంటికి పోయి, ఇంత తినీ పగటికి ఇంత టిఫిన్ బాక్స్ లో పెట్టిస్తే, అది పట్టుకోని, పశువులను తోలుకొపోయి కంచేలో మేపుకోని మళ్ళీ సాయంత్రం వాటిని తోలుకోని ఇంటికి వచ్చి, వాటిని కట్టేసి, మేతేసి.. ఇంకేమన్నా చిన్నా–చితక పనులుంటే చూసుకోని.. అప్పటికే రాత్రి అన్నం తినేయాల్లైతే.. 'యాలాద్రి' వాళ్ళ ఇంటికి పోయి, ఇంత బువ్వ తిని, దొరింటికీ పోయి పడుకునే వాణ్ణి. ఐతే, వీళ్ళు కేవలం 'నూకలబువ్వ' దాని మీదికీ పచ్చి పులుసు లేదా మామిడికాయ పచ్చడి పెట్టేవాళ్ళు. ఐతే, ఈ 'నూకల బువ్వ, పచ్చి పులుసు, మా మామిడి కాయ పచ్చడి' గురించి ఎవన్నంటే..!? " మీ దొర, మీదొరసాని, నీకు వండిపెట్టమని ఈ నూకలే ఇచ్చింద్రు. అదే మేము పెడుతున్నాం.." అని అన్నాడు 'యాలాద్రి' వ్యంగ్యంగా.

ఐతే,ఎండాకాలంలో స్వేచ్ఛగ, దూరం–దూరం వరకు పోయి, మేసిన పశువులు, వర్షాకాలం వచ్చేసరికి పరిమితమైన ప్రదేశం లోనే తిరిగి–తిరిగి మేత మేసే పరిస్థితి ఏర్పడింది. దానితో పాటు గత రెండు సంవత్సరాలుగా ఆపశువుల్లో కొన్ని దొంగవైనయి. ముఖ్యంగా ఎల్లకోల్యాగైతే చేన్లు మొలకెత్తగానే పశువుల మంద నుండి రెప్పపాటున తప్పించుకోని 'లచ్చుమపురం'లోని 'కృష్ణా రెడ్డి' 'దొర' గారి వెరుశెనిగా మొలకల చేనులో పడి మేయడం అలవాటయింది. ఈ విషయం మా పెద్ద పాలేరు 'యాలాద్రి'కీ తెలిసింది. " అరే 'బొందయ్య' నువ్వు నా కొడుకులాంటోడివి, నువ్వు ఆ పాపిస్టోని చేతి దెబ్బలు తింటుంటే నేను చూడలేను. వాడు నమ్మించి దొరకబట్టీ కొడితే ఇక జీవితంలో బతికినా చచ్చినోడితో సమానం. ఇట్లనే పోయిన సంవత్సరం,

పాపం ఆ సన్నూర్ తండోడినీ నమ్మించి, నవ్వుకుంటూ దగ్గరికి పిలిచి, దొరకబట్టీ, రెండు చేతులు కట్టేసి, తనకు ఎదురు లేరని భావించీ, ఎదడికర్రతో ఎక్కడపడితే అక్కడ కొట్టీ–కొట్టీ లేవకుండా చేస్తే, వాడు జీతం వదిలేసి పారిపోయిండు. కాని వాడు ఈనాటివరకు సరిగ్గా కోలుకోలేదు. కావునా జాగ్రత్తగా ఉందూ సుమా.. తర్వాత చెప్పలేదనేవు ..! . ఆ 'దొంగా' కోడే మెడకు తుంటకట్టూ. రెపటినుండీ దానిమీద కన్నేసివుంచూ..అర్థమయిందా..!? " అని ఆ దొర యొక్కా అమానవీయ వ్యక్తిత్వం గురించి వివరంగా చెప్పాడు యాలాద్రి.

ఆ 'కృష్ణా రెడ్డి దొర' గురించి మా పెద్ద జీతగాడు 'యాలాద్రి' చేప్పే దానికి మరియు బయట జనం మాట్లాడుకునే దానికి తేడా లేదు. అప్పటినుండి నాలో భయం ఎక్కువయింది. ఆ 'దొంగ కోడే' మెడకు తుంట కడదామంటే అది ఇంటికి రావడం లేదు. ఒక వేళ వచ్చినా ఏ రాత్రో వచ్చి మళ్ళీ చేన్లోమేసేందుకు వెళ్ళిపోతుంది. అది ఇప్పటి అలావాటే కాదు, గత సంవత్సరం నుండి చేన్లల్లోపడిమేయడం అలవాటయింది.

ఒక రోజు సాయంత్రం పొద్దుబూకాల్లకూ, పెరట్లో చార్మినార్ సిగరేట్ డబ్బా చేతిలో పట్టుకోని, ఒసన్నటి ఎదడు కట్టే సంకలేసుకోని, నేను వరిగడ్డీ కోసం పోయే దారిలో నిలబడి ఉన్నాడు. నేను పశువులను కట్టేసి మేతవేసేందు గడ్డి వామి దగ్గరికీ పోతున్నాను. " ఒరే రాముగా 'అగ్గిపెట్టె' తీసుకోని రారా.." అని అన్నాడు 'దొర 'చాలా సాఫ్టుగా. అప్పటికీ 'యాలాద్రి' చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి, కాని నేను జీతమున్నది వాళ్ళ తమ్ముడికే కదా..!?, ఇంత చిన్న మాట వినకపోతే ఏమనుకుంటాడో అని.. ఎట్లైతే గట్లే తర్వాత చూద్దామని.. భయపడుకుంటానే, 'అగ్గిపెట్టె' పట్టుకోని దగ్గరికి పోయి, 'అగ్గిపెట్టె' ఇయ్యబోయిన, దొర అదే చేయ్యినీ గట్టిగా పట్టుకోని, రెండడుగులు వెనక్కు జరిగి నావెనక భాగాన తొడలమీదికెల్లి గుంజి ఒక్కటి సరిసిండు. నేను ఆ దెబ్బకి లబో–దిబోమని, 'ఏ..యాడియే...ఏ బాపురే..!', అని మొత్తుకోని కిందపడి, చేతినిండా మట్టి పట్టుకోని, పైకి లేస్తూనే 'దొర' గారి కంట్లో కొట్టీ, ఆ రాత్రే, ఊరొదిలి మా ఇంటికి –తండాకు పారి పోయి వచ్చిన.. . ఆ విధంగా "కర్ణుడి చావుకు అనేక కారణాలు" అన్నట్లు.. నేను ఊళ్ళో 'జీతం' వదిలీ పారిపోయి, తండాకు రావడానికి ఈ పై కారణాలు...కావా? .

––— డా.బోంద్యాలు బానోత్(భరత్)

## యుద్ధాలు లేని నేల (కవిత)–జయసుధ కోసూరి

Posted on April 1, 2025 by vihangapatrika

ఎక్కడుంటుందంటారు.. !

తెగిపడని తలలు చూసే చూపుల్లోనా…

బీడువారి నెర్రెలిచ్చిన

భూమిలో ఇంకిన రైతు రక్తంలోనా.. !

దేశం కోసం కాపుకాస్తున్న

జవాన్ల బూట్ల చప్పుళ్లలోనా.. !!

ఎక్కడుందంటారు.. !!

దారితప్పిన దగాకోరుల జీవితాల్లోనా..

గూడు చెదరి గుండె మండిన

పేదల కడుపాకలిలోనా.. !!

ఎక్కడుందంటారు.. !!

అమ్మతనం అభాసుపాలైన

అంగడి బొమ్మల మనోవేదనలోనా..

ఆ మసిబారిన మనసులకు

ఓదార్పునివ్వలేని ఈ సమాజంలోనా.. !!

ఎక్కడుంది..

యుద్ధం లేని నేల.. !!

ఏ మనసున ఉంది..

ఓ మనిషీ…

ప్రశ్నించుకో..??

–జయసుధ కోసూరి

★★★★

# ఉగాది కవితా లత(కవిత)–ఆర్ . విజయశ్రీ

Posted on April 1, 2025 by vihangapatrika

అనాదిగా వస్తున్నది అన్యోన్యంగా గడిపే ఉగాది
తెలుగు వెలుగులకు శ్రీకారం చుట్టేది ఈ సంవత్సరాది
వచ్చే ప్రతిసారీ తెచ్చేది సంతోషాల ప్రోది
చైత్ర శుద్ధ పాడ్యమి నాటి సంబరాల గాది
శిశిరానికి అంతం పలికి, వసంతానికి వంత పాడే స్వాగతం
పచ్చిక బయళ్ళ పచ్చదనంతో ప్రకృతి కాంత సుమనోహరం
కోకిలపాటకు సాకారం లేత చిగుళ్ళ ఆహారం
ఆబాల గోపాలానికి నులివెచ్చని పచ్చతోరణం
దేశ, విదేశాల్లో విరాజిల్లే తెలుగు జాతికి వరం
అంబర చుంబిత సంబరం, ఈ సంవత్సరాది శుభారంభం
షడ్రుచుల సమ్మేళనంతో ప్రారంభం విశ్వావసు నామ సంవత్సరం
తెలుగు క్యాలెండర్లో నూతన అధ్యాయం
ఉగాది ఉషోదయం.. ఆరుగాలశ్రమకు దక్కే ఫలితం
ఆత్మీయ కలయికల పండుగ నిండుదనం
కవి సమ్మేళనంలో గుబాళించే హరిచందన పరిమళం
ఆరురుచుల ఉగాదిపచ్చడి అమృతతుల్యం
తెలుగోడి తీపి కలలు కావాలి సాకారం
తమ్ముళ్ల ప్రేమాభిమానం, తెలుగు మహిళల మమకారంతో
ఆప్యాయతలు పెంచుకునే పలకరింపులు
పంచాంగ శ్రవణాలతో ఆదాయ ఫలాలు
ధర్మంగా,నింపాదిగా సంపాదించే సంపదలు
తృప్తినిచ్చే జీవితలకు ఆనంద మాలికలు
అంబరమంటే సంబరాలకు నేపథ్యం
తెలుగుతనం ఉట్టిపడే నాట్య విన్యాసాలు
వీనుల విందైన సంగీత సంధ్యా సరాగాలు
ఉగాది పండుగకు శ్రీకరం
శుభాకాంక్షలపర్వం
దైవాశీస్సులతో కలగాలి అందరికీ శుభకరం

–ఆర్ విజయశ్రీ

★★★★

# ఉగాది – గిరి ప్రసాద్ చెలమల్లు

Posted on April 1, 2025 by vihangapatrika

విశ్వావసు వస్తుంది  విశ్వాసం నింప
కానీ మతోన్మాదం కడు వేగంగా విస్తరిస్తుంది

ఇంటిముందరి వేప చెట్టు
మీది కాకి అరవట్లేదు
బంధువులొస్తారనే కబురూ లేదు
యాంత్రిక జీవనంలో మనిషి యంత్రమై
భావోద్వేగాలకు దూరం

కొబ్బరి ఆకుల మధ్య కోయిల కూతలో
రామజపం వినిపిస్తుంది
తానెక్కడ జీవం విడవాల్సి
వస్తుందేమోననే భయంతో

వేపపూత రాలిపోతుంది
అందరిలో ఇమిడిపోయి
రుచినిచ్చిన గతం
ఇప్పుడు ఒకే మతమనే
 రాజ్యం నినాదం రుచించక

మామిడి తోరణాల్లోన దాగివున్న పురికోస
ఎవరు తయారు చేసారని
మావిడాకులు అడుగుతున్నాయి
అన్యమతస్థులైతే ఎక్కడ
 తెంపేస్తారోనని ఆవేదనతో

కలాల్లో సిరా బైటికి రానని మొరాయిస్తుంది
కవుల్లోని భావాలు అస్థిర వ్యవస్థను ప్రశ్నిస్తే
సిరా తప్పని ఖైదుని చేస్తారేమోనని

అక్షరాలు అల్లుకోట్లేదు
పదాల కూర్పు కుదురుకోట్లేదు
చింతపండు చేదెక్కి దిగనని మొరాయిస్తుంది
గలగల పారిన నీళ్ళు గరళాన్ని
మోసుకొస్తున్నాయి
సీసాల్లో నీళ్ల కీళ్లనొప్పులు తెస్తున్నాయి
ప్రశ్నించే గొంతులు లేవని ఉగాది పచ్చడి
 గొంతు తడపనని తెగేసి చెప్పింది

అరవై ఏళ్ళ క్రితం చూసిన
సమైక్యత సమగ్రత కానరాక
విశ్వావసు విస్తుపోతుంది
రానున్న రోజుల్లో ఇంకెన్ని ఘోరాలు
చూడాలనో అనుకుంటూ
కోయిలను వెంటేసుకుని
వెళ్ళి పోవాలనుకుంటుంది

– గిరి ప్రసాద్ చెలమల్లు

★★★★

## గాయాల గాయని!(కవిత) – బాలాజీ పోతుల

Posted on April 1, 2025 by vihangapatrika

మా ఇంటెన్క బాలక్క,
రాగం తీసి పాడుతుంటే,
రాళ్లైనా కరుగుతయనిపించేది!

మాయదారి మాయలోకం,
ఆడదానికి పాటెందుకని అన్నప్పుడల్లా,
"నీ గొంతెత్తి పాడే అక్క.." అని
గట్టిగా అరవాలనిపించేది!

ఐతారం దినం నాడు,
టీవీ సూడనికని ఆలింటికి పోతే,
తిన్నవారా? అని అన్నమేసిచ్చి,
టీవీలచ్చే పాటలన్నీ
ఇనసొంపుగ పాడే బాలక్కకి,
తమ్ముణ్నై ఎందుకు
పుట్టలేదా అని ఏడ్చేవాడిని

ఆడతనపు పాటనే కాదు,
ఆమెనీ వెలివేసింది,
పదహారేళ్లు నిండాయో లేదో,
పెళ్లి పాటని పాడమని
లోకమంతా కోడై కూసింది
ఆ గేయపు గాయాలు,
గుండెల్లో ముళ్ళ పొదలని పెంచాయి!

పాటలు పాడకుండా ఆపే ఆ గొంతులు,
ఏనాడు మూగబోతాయో,
ఆ దినం వేయి గొంతుకల్తో,
తన తల్లి రాగాన్ని ఎత్తుకొని,
గుండెలవిసేలా పాడుతుంది

తన నోటిని కుట్టి వేయొచ్చు,
తన గొంతుని కొడవలితో కొయ్యొచ్చు
కానీ,
తన గుండెల్లో నిండుకున్న
పాటనేం చేస్తారు?
ఆమె ఇప్పుడు ఒట్టి
గాయని కాదు,
గాయాల గాయాన్ని
నిశ్శబ్దం తెగిపడేంత గట్టిగా పాడే,
గాయాల గాయని!

–బాలాజీ పోతుల

★★★★

# అమ్మ కావడం గొప్ప వరం (కవిత)– బత్తుల రమ్య

Posted on April 1, 2025 by vihangapatrika

మా అమ్మ జన్మనిచ్చిన నాకు వరం

రక్తపు ముద్దతో

నేను కడుపులో ఉండగా

నన్ను నవమాసాలు

మోస్తూ ఉండగా

కత్తులతో యుద్ధం,

నొప్పులతో బాధ భరిస్తూ ఉండగా

నాకు కొత్త లోకాన్ని చూపి

ఆ బాధలు మర్చిపోతూ ఉండగా

నన్ను చూసి ఆగిపోయిన

తన కన్నీరు మాయామవుతూ

బిడ్డని ఎదకీ హత్తుకొని,

ముద్దాడుతూన్న

మధుర క్షణం అనుభవిస్తూ

తన నరక వేదన మరచిపోయి

బిడ్డ క్షేమం గురించి తపన పడుతూ

మా అమ్మ జన్మనిచ్చిన నాకు వరం

బిడ్డ పుట్టిందని తండ్రి నీ విడిచి

మా అమ్మ కొంగు కవచం లా

నన్ను కాపాడుతూ

అంతుచిక్కని అమ్మ ప్రేమ నాతో

మా అమ్మ జన్మనిచ్చిన నాకు వరం

సృష్టిలో త్యాగాల కీ నిదర్శనం

అమ్మ తోడు, నీడ నాతో ఉండగా

కొత్త లోకాన్ని,జీవితాన్ని పరిచయం చేసిన

మా అమ్మ పాదాలకి వందనం

నా కంట కన్నీరు కారిస్తే అమ్మ గుండెలో

అలజడి మొదలవుతున్నా

నన్ను ఇరవై అయిదు ఏళ్ల వయసులో

పొరుగు వారి చేతిలో పెట్టీ

పెళ్లి అనే బంధంతో నన్ను

అమ్మ నుండి వేరు చేస్తూ

అమ్మా నాలో మీ అమ్మని

చూసుకుంటూ మూరుస్తూ

అమ్మ కావడం గొప్ప వరం

మా అమ్మ జన్మనిచ్చిన నాకు వరం

– బత్తుల రమ్య

★★★★

# తలఎత్తిన తండ్రి (కవిత)– శ్రీలేఖ

Posted on April 1, 2025 by vihangapatrika

పురిటి నొప్పులు నీకు లేకపోయినా

పుట్టెడు కష్టాలనుండి వెలువడినావు

నాలుగు భాగాలైన నీ ప్రేమకు

నలుసై మేము జన్మించినాము..

తప్పటడుగులు వేసిన ఏనాడూ

నీ చెయ్యి ఎత్తలేదు..

నీ జేబు చిల్లరే నాకు చిరు తిండ్లు

కడప కడుగుతుంటే వచ్చాయి కన్నీళ్లు

మెట్టినింట అడుగుపెట్టిన

పుట్టి నింట నీ పరువు పెంచిన

కోర లేదు ఏనాడు కోరికలు

క్షణమైనా లేకపాయ తీరికలు

తల ఎత్తుకొని నడువు

నాన్న చెమ్మగిళ్ళకే ఇకనైనా..

— శ్రీలేఖ

★★★★

## గాజు పగుళ్ళ చప్పుడు….?(కవిత)– పంపోతు నాగేశ్వరరావు

Posted on April 1, 2025 by vihangapatrika

ఖాళీ సీసా తీసి

ప్రతిదినం గాలి తీసేసి

మూలాన పగులగొట్టేసోణ్ణి

పగిలిన సీసాల ముక్కలు

కూర్చడమే నా పని

నిశ్శబ్దంగా ఉండే గదిలో….

రాత్రి అయ్యిందంటే చాలు సీసాలో

మత్తుగా ఊగి ఊగి పగలని బొమ్మ వొళ్లో

హ్మ్….. ఊరేగింపుగా

సీసా పల్లకినెక్కిస్తాడు

మూగదయిన జింకపిల్ల

రాత్రి పూట మత్తు పంజాకి

వొళ్ళంతా

దెబ్బలు తింటూ ఉంటే

సీసాతాగిన సింహం అనుకూలవతి జింకెన్ని

పంజాలతో

గాట్లెసి మనసు ఖండ ఖండాలు చేస్తుందో…..

భాధగా ఉన్న ఆమె దేహంపై మత్తుకారం పూయొద్దు

సీసా ముక్కలైంది

ఇక అతుక్కోదేమో…….

మత్తు సింహం పగిలిన పెంకుల్తొ మనసు పేర్చాలో

మత్తు వీడింది

సీసా మాత్రం అతుక్కోలేదు……

పగిలింది….. ఇంకా శబ్దం వస్తుంది

మత్తెక్కిన చేయి దెబ్బకి

శరీరంపై దీర్ఘకాలిక అచ్చేశాడు మత్తుమాంత్రికుడు

మత్తు స్పర్శ తప్ప శరీర స్పర్శ తెలీదు

గాజు పగుళ్ళ చప్పుడు చేస్తోంది

దేహాన్ని రెండుగా చీలించడం కాక పూర్ణించడ మెరగని రాతి స్పర్శ

అందుకే ఇప్పుడు

ఖాళీ సీసా….. మనిషి లేని సీసా

ఒంటరి సీసా…….

ఇప్పుడు

మత్తువీడినా ఖాళీ సీసా పూడ్చగలదా..!

రాతిబారిన గుండెలో కాసిని పూలు పూయించగలడా ..?

జింక పిల్ల కన్నీరుతో సీసా నింపి తాగేవొడికి

జీవితాన్ని మత్తు స్పర్శ నుంచి కాక

నిజస్పర్శను స్పృశించగలడా...

పలిగిన గుండెలో ఇప్పటికైనా కాస్త ప్రేమ
పసరు పొయ్యి

గాజు సీసాలు పగలకొట్టడం కాదు

అతికించడం నేర్చుకో.........?

వీలైతే పగిలిన పెంకుల్ని బంధాల గమ్ముతో
అతికించి

మార్పు అనే నీరోసి నమ్మకమనే గులాబీ పువ్వు
పూయించు

ఇక గాజుపగుళ్ళ చప్పుళ్ళు ఉండవు

ఇక మనసు పగుళ్ళ చప్పుడు ఉండవు

మత్తు వీడండి ఇంటి ఆలినో ఏలండి ఇకనైనా!

(మద్యానికి బానిసైన వారిగురించి)

–పంపోతు నాగేశ్వరరావు

★★★★

## అబద్ధపు నవ్వు –(కవిత)– పాలేటి శ్రావణ్ కుమార్

Posted on April 1, 2025 by vihangapatrika

నవ్వును ధరించడం అలవాటు అవుతుంది

బాధ కళ్ళలోనే ఇనికిపోయినప్పుడు

కళ్ళలో నుండి అదే బాధ

మనసులో దాగిపోయినప్పుడు

మనసులో దాగిన బాధను,

మనసు గదుల్లో బంధించినప్పుడు

బంధింపబడిన బాధంతా బరువెక్కి,

బరువెక్కి మోయలేనంత భారమైనప్పుడు

భారమెక్కిన మనసు,

రాయిలా మారుతున్నప్పుడు

రాయిలా మారిన మనస్సు,

సమాజంతో స్పర్శను కోల్పోయినప్పుడు

ఎన్నో కలలతో, ఆశలతో నిండిన

లోకంలో చోటు లేదని తెలిసినప్పుడు

యంత్రాంగపు జీవితంలో

మనసు రోబోలా మారుతున్నప్పుడు

మనసులేనినాడే జీవితం

బాగవుతుందని తలిచినప్పుడు

ప్రకృతిని కూడా ఆనందించలేని,

స్పృశించలేని నయనాలు

ఒక అబద్ధపు నవ్వుని ధరిస్తుంది

ఒక అబద్ధపు నవ్వు,

ధరించడం అలవాటు అవుతుంది

అదే అన్ని సవాళ్ళకు చివరి

సమాధానం అని నిశ్చయించుకుంటుంది

బాధ అనే భావాన్ని పూర్తిగా కోల్పోతుంది

ఆనాడు మనిషి రాక్షసత్వాన్నో,

యోగితత్వాన్నో పొందుతాడు

ఇతరుల బాధలో నృత్యమైన చేస్తుంది,

లేదా లోకమంతటి బాధను ఆవిరి చేస్తుంది

చిట్టచివరన, మొట్టమొదటిగా

బాధ నవ్వుని ధరించేలా చేస్తుంది

బాధ నవ్వుని ధరించేలా చేస్తుంది

– పాలేటి శ్రావణ్ కుమార్ ,

★★★★

## అంతర్జాల భూతం(కవిత)– ద్రవిడ హరి

బెట్టింగ్ బాగోతం

వాడవాడలా నేడాయేరాతం

ఎందరినీ మింగునో ఈ భూతం

అడ్డులేదెందుకో జరిగితే ఘోరం

ఆన్లైన్ల ఈ హింసకు

అమాయకులే ఆత్మబలిదానం

ఆశలేపింది చరవాని మైకం

తొవ్వసూపింది ఆశల అంతర్జాల పైకం

కేసినో రమ్మీ కల్చర్

మంట్లే వడేదెప్పుడో

బొంద పెట్టేదేన్నడో

మందిని ఆల్కగా బోర్రేయవట్టే

నాన్న జేబునుండి దోసి

అమ్మ పోపుడబ్బులు బోర్రెసి

తోబుట్టువుల మాయజేసి

తాకతిమించి జూడమాడవట్టే

అలీ పుస్తెలు

అంగట్ల తాకట్టు పెట్టి సైతం

ఆల్గా అత్తయని నమ్మి

బెట్టింగ్ బాగోతలకు బలైన కుటుంబాలెన్నో....

రెండుమూడింతలకు ఆశపడి

ఉన్నదంతా ఊడిసిపెట్టి

మోసపోయామని తెలుసుకొని

ఉరికొయ్యలకు ఎలాడవడ్డ జివ్వాలేన్నో..

పసి కూనలెందరినో

బెట్టింగ్ భూతం పీడిచ్చిన

అభయమియ్యలేదే ఏ దేవుడు

కాపాడ నిలువరాడాయే జగతికి నేడు

–ద్రవిడ హరి

★★★★

# అంతర్వీక్షణం–3 (ఆత్మకథ )–విజయభాను కోటే

Posted on April 1, 2025 by vihangapatrika

నా curiosity గురించి, అర్థం అయిపోయింది కదా.. ఇక ఎన్ని కథలు చెప్పినా, చివరికి చేరేది ఆ curiosity కొసకే.

కొన్నాళ్ళకు మా తమ్ముడు పుట్టాడు. వాడంటే మహా ముద్దు అందరికీ. చెల్లికి మరీను. నేను, చెల్లి ముందు ఒక స్కూల్ లో చదివేవాళ్ళం. తమ్ముడిని స్కూల్ లో వేసే సమయానికి డాడీకి కలెక్టర్ ఆఫీస్ కి transfer అయింది. అప్పుడు మా ముగ్గురినీ సెవెన్త్ డే స్కూల్ లో వేశారు. ముందు ఉన్న స్కూల్ లో special English ఉండేది. హిందీ లేదు. క్రొత్త స్కూల్ లో హిందీ compulsory. ఇక నా గొడవ చూడాలి. అందరూ హిందీ పాఠాలు చదువుతూ ఉంటే, నాకు హిందీ అక్షరాలు కూడా రావు. అసలే తిక్క. మా హిందీ టీచర్ శోభ. నాకు ఇంకా ఆమె పొడవాటి జడ గుర్తు.

"ఏమీ పర్వాలేదు, నీకు ముందు స్కూల్ లో నేర్పలేదు కదా! ఇపుడు నేర్చుకోవచ్చు. నేను సహాయం చేస్తాను" అని మెత్తగా, ముద్దుగా చెప్పారు ఆమె. రోజుకు కొన్ని అక్షరాలు నేర్పేవారు. క్రొత్తగా ఏర్పడిన ఫ్రెండ్స్ కూడా సహాయం చేసేవారు. అబ్బే! అయినా నాకు అదేమీ కుదిరేది కాదు. క్లాస్ లో పిల్లల్లాగే నేను కూడా హిందీ చదివేయాలి. అంతేనా, హిందీ టీచర్ తో హిందీలో మాట్లాడేయాలి! అది కూడా అతి త్వరలో! జరిగే పనేనా?

ఇంటికి వెళ్ళి తిక్క పేచీ పెట్టాను. నాకు హిందీ రాదని నాకు కోపంగా ఉందని, పాత స్కూల్ లో హిందీ ఎందుకు లేదని.. ఇలా ఒకటే గోల!

"సరే! పేచీ పెట్టకు, నీకు హిందీ నేను నేర్పిస్తాను" అంది మా మమ్మీ!

అప్పటికి మా మమ్మీ టీచర్ గా పని చేసేదని, తర్వాత మా ముగ్గురినీ సరిగా చూడడం కుదరడం లేదని ఉద్యోగం మానేసిందని తెలుసు కానీ ఆమెకు హిందీ వచ్చని నాకు తెలియదు. నాకు ప్రపంచాన్ని గెలిచినంత సంతోషం అనిపించింది.

ఇక ఆ రోజు మొదలు మా మమ్మీకి ప్రత్యక్ష నరకం ఎలా ఉంటుందో చూపించానని వేరే చెప్పాలా? స్కూల్ నుండి వచ్చింది మొదలు, రాత్రి పడుకునే వరకూ (పడుకున్నాక కూడా, నిద్ర పోకుండా) "దాన్ని హిందీలో ఏమంటారు? దీన్ని హిందీలో ఏమంటారు? హిందీలో ఈ పదం ఎలా రాయాలి? ఆ పదం ఎలా రాయాలి? నాకు ఆకలి వేస్తోంది అన్నదాన్ని హిందీలో

ఏమంటారు? నాకు కోపం వచ్చింది అనేదాన్ని హిందీలో ఏమంటారు?.... అంతు లేని కథ! మా మమ్మీకి ఒకటే వ్యధ!

మా మమ్మీ అదృష్టమో ఏమో, అదే సమయంలో ఇంట్లోకి టీవీ వచ్చింది. బ్లాక్ అండ్ వైట్ ఒనిడా! అప్పుడు దూరదర్శన్ మాత్రమే వచ్చేది. ఒక హిందీ భాష రాకపోవడం అనేది నన్ను ఎంత తిక్కకు గురిచేసింది అంటే, టీవీలో హిందీ కార్యక్రమాలు మాత్రమే కాదు, సంస్కృతం వార్తలు, ఆదివారం వచ్చే ఇతర భాషా సినిమాలు, ఇంగ్లీషు వార్తలు, ఆఖరికి బధిరుల వార్తలు కూడా చూసేసేదాన్ని. బధిరుల వార్తలు చూస్తూ, ఆ సంజ్ఞలు ప్రాక్టీస్ చేసేదాన్ని. స్కూల్ లో, ఇంట్లో ఆ సంజ్ఞలు అందరికీ చేసి చూపిస్తూ, దాని అర్థం వివరించేదాన్ని. ఇతర భాషా సినిమాలు తప్పకుండా చూసేదాన్ని. ఆరు నెలల తర్వాత నా తిక్క ఒక లెక్కకు వచ్చింది. నాకు హిందీ చదవడం, రాయడం మాత్రమే కాదు, మాట్లాడడం వచ్చింది. కొన్నాళ్ళకు నేను హిందీ మాట్లాడితే నేను ఉత్తరాది మనిషినేమో అనుకునేలా నా హిందీ భాష మారింది. అంటే దాని అర్థం, నిద్రలోనూ, మెలకువలోనూ నేను హిందీలోనే ఆలోచించి ఉంటాను!

ఇలా నాలా ఇష్టమైన లేదా అనుకున్న విషయాన్ని నేర్చుకోవడానికి ఎంతో మంది ఇలాంటి ప్రయత్నాలు, ప్రయోగాలు చేసి ఉంటారు. వాళ్ళందరూ Heutagogues అని ఇపుడు అర్థం అవుతుంది. నేను Heutagogy పై ప్రయోగాలు చేయడానికి నా ఆటిట్యూడ్ కారణం అయి ఉండాలి!

నాకు అమ్మమ్మ ప్రపంచంతో పరిచయాలు ఎక్కువ. అమ్మమ్మ ఒక గ్రంథం. ఆమెతో ఉంటే సంతోషం తప్ప ఇంకేమీ ఉండదు. అసలు ఒక్కోసారి ఆమె విద్యార్థులు ఎంత అదృష్టవంతులో కదా అనిపించేది నాకు.

నేను Heutagogy Expert అయ్యే ప్రక్రియలో ముందుగా ఐదో తరగతి specialist ను ఎలాగో, మా అమ్మమ్మ కొయ్యే జానకి ఒకటి, రెండు తరగతుల specialist.

ఆమె service మొత్తంలో ఒకటి, రెండు తరగతులకు బోధించిన సంవత్సరాలే ఎక్కువ అంట. ఎప్పుడూ చెప్పేది, "పునాది సరిగ్గా ఉంటే, ఇల్లు నిలబడుతుంది, పునాది సరిగా లేకపోతే, ఇల్లు పిచ్చుకలు పీకినా పడిపోతుంది" అని. ఆమె సామెతలు ఇప్పటికీ నా చెవుల్లో మారు మ్రోగడమే కాదు, అవి alarm bells నాకు.

నా అల్లరి పెరిగినపుడు, మా మమ్మీకి ఇక భరించే ఓపిక నశించినపుడు నన్ను అమ్మమ్మ దగ్గరికి పంపేసేది. మా మేనమామలు ఇద్దరూ transporters అన్నమాట. విశాఖపట్నం నుండి

కొవ్వూరు రైలులో తీసుకొచ్చేవారు. కొన్ని రోజులు అమ్మమ్మ దగ్గర ఉన్నాక మళ్ళీ తిరుగు ప్రయాణం కట్టేదాన్ని.

అమ్మమ్మ, తాతయ్య దగ్గర ఉన్నన్ని రోజులూ భలే ఉండేది. ఉదయం నా పనులు, ఇంటి పనులు చేసిన అమ్మమ్మ తాతయ్య కన్నా ముందు నన్ను తీసుకుని స్కూల్ కి వెళ్లిపోయేది. తాతయ్య హెడ్ మాస్టర్, అమ్మమ్మ అసిస్టెంట్ టీచర్.

స్కూల్ లో మట్టి బొమ్మలు తయారు చెయ్యడం, ఆకులను నూరడం, చిన్న చిన్న లక్క పిడతల్లో వంట చెయ్యడం, గ్రౌండ్ లో ఉన్న జారుడుబల్ల జారడం, అప్పుడప్పుడూ అమ్మమ్మ, తాతయ్య పిల్లలకు పాఠాలు చెప్తుంటే ఒక చూపు, ఒక చెవి అటు వేసి, మళ్ళీ ఆటల్లో పడిపోవడం. సాయంత్రం ఇంటికి వచ్చి, అమ్మమ్మ వంట చేస్తుంటే, తాతయ్య దగ్గర కాసేపు ఉండి, వంటింట్లో అమ్మమ్మ చుట్టూ తిరగడం, రాత్రి అయ్యాక అమ్మమ్మ చెప్పే మాటలు వింటూ భోజనం చేసి, పక్క ఎక్కి అమ్మమ్మ చెప్పే కథలు వింటూ నిద్రలోకి జారుకోవడం. ఎంత అద్భుతమైన రోజులు అవి!

అందరికీ ఈ తీపి రోజులు ఉంటాయి కదా!

రాబోయే రోజుల్లో ఇలాంటి రోజులు ఉండవేమో అని ఆపుడపుడూ భయంగా అనిపిస్తుంది.

అమ్మమ్మ ఒక అద్భుతం. ప్రతి ఒక్కరూ అమ్మమ్మ గురించి ఇలానే చెప్తారేమో కదా! నా అల్లరిని కూడా enjoy చేసిన మనిషి అంటూ ఉంటే మా అమ్మమ్మ మాత్రమే!

అమ్మమ్మ ఒక ప్రభుత్వ పాఠశాలలో టీచర్. ఆమె ఒక జీవనది. ఎందరికో సహాయం చేసింది, ఎందరినో తీర్చిదిద్దింది. నాతో సహా!

చిన్నప్పుడు అమ్మమ్మ అంటే నాకు నచ్చిన వంటలు వండుతుంది, నా అల్లరిని ఎంజాయ్ చేస్తుంది, భరిస్తుంది, నాకు అన్ని పనులు చేసి పెడుతుంది, నాకు భోజనం తినిపిస్తుంది, నాకు కథలు చెప్తుంది, నాకు జ్వరం వస్తే తెల్లవార్లూ మేలుకుని ఉంటుంది, తాతయ్యతో డాక్టర్ దగ్గరికి పంపిస్తుంది, నేను ఎక్కడున్నానో, ఏం చేస్తున్నానో చూసుకుంటూ ఉంటుంది.. ఇవే తెలుసు!

ఎదిగే కొద్దీ అమ్మమ్మ నాకో గూడు. మమ్మీ మీద కోపం వచ్చినా, ఏదైనా బాధ అనిపించినా, బాగా నవ్వుకోవాలి అనిపించినా, ఏ పనైనా జరగాలన్నా, అన్నింటికీ అమ్మమ్మ నాకో గూడు, ఒక support system.

ఇంకాస్త ఎదిగాక అమ్మమ్మ ఒక మహోన్నత పర్వతం అనీ, జీవనది అనీ, పచ్చని అడవి అని అర్థం అయింది. అప్పటికే ఆమెలా మాట్లాడడం, ఆమెలా ఆలోచించడం, ఆమెలా నిర్ణయాలు తీసుకోవడం మొదలైనవి నాకు తెలియకుండానే వచ్చేశాయి.

ఒక అడుగు వేసే ముందు 100 అడుగుల తర్వాత ఏముందో ఆలోచించడం ఆమె నుండే వచ్చింది.

ఎవరినైనా ఆర్తిగా అర్థం చేసుకోవడం, ఎదుటివారి కోసం ఏదో ఒకటి చేయడం ఆమె నుండే వచ్చింది.

ప్రతి కాలంలోనూ ఆ కాలానికి తగ్గ సమస్యలు ఉంటాయని, వాటికి ఆ సామాజిక పరిస్థితులకు అనుగుణంగానూ, పరిస్థితిని దాటి సాధించే పరిష్కారాలు కూడా ఉంటాయని ఆమె చెప్పే anecdotes వినే తెలుసుకున్నాను.

అమ్మమ్మ అన్ని విషయాలు anecdotes గానే చెప్పేది. ఎంత ఆసక్తికరంగా చెప్పేదో! ఇంకా ఇంకా చెప్పమని అడుగుతూనే ఉండేవాళ్లం అందరం. తన చిన్నప్పటి కథలు నాకు ఇంకా కళ్ళకు కట్టినట్టే ఉన్నాయి.

తన చిన్నప్పటి విషయాలు చెప్తున్నపుడు అప్పటి సమకాలీన అంశాలు చెప్పకనే చెప్పేది. కాణీ, అణా లాంటి ఆర్థిక విషయాలు, డ్రామాలు చూడడం, ఇంట్లో తను చేసే అల్లరి, అమ్మమ్మ తండ్రి సహదేవుడుగారి ఆయుర్వేద వైద్య విద్య, ఉపాధ్యాయుడుగా ఉంటూనే, ఆయుర్వేద వైద్యునిగా ఊరి వాళ్ళకు చేసిన సేవ, ఆయన మందులు నూరే రాయి, అప్పటి రోగాలు, medical science వృద్ధి చెందని, చెందుతున్న రోజులూ, అప్పటి సమాజం, స్వాతంత్ర్య పోరాటం రోజులూ, అప్పటి ప్రభుత్వాలు, ఎన్నో విషయాలు... అన్నింటికన్నా నేను అత్యంత గౌరవించే విషయం మా అమ్మమ్మ తండ్రిగారైన సహదేవుడు గారు, ఆ కాలంలోనే ఆడపిల్లలను చదివించడం, ఉద్యోగం చేయాలని చెప్పడం.

ఎవరైనా ఆడపిల్లకు పెళ్లి ఎపుడు అని అడిగితే, “చేతికి ఒక కర్ర ఊతం ఇచ్చాకే పెళ్లి” అనేవారట! చేతికి కర్ర అంటే చదువు, ఉద్యోగం!

ఒక్కో రోజు మా మమ్మీ, మేనామామల చిన్నతనం గురించి, ఒక్కో సంఘటన చెప్పేది. వాళ్ళ విషయాలన్నీ కూడా నాకు ఇంకా కళ్ళకు కట్టినట్టే గుర్తుకు వస్తాయి. Brain Surgery తర్వాత ఈ మధ్య జరిగిన విషయాలు, మనుషుల ముఖాలు, వాళ్ళ పేర్లు మర్చిపోతున్నాను. కానీ అమ్మమ్మ ఎప్పుడో చెప్పిన చాలా విషయాలు మరుపుకే రావు.

ఒక్కో రోజు మా చిన్నప్పటి విషయాలు చెప్పేది. మా విషయాలు మేమే వింటూ ఒకటే నవ్వుకునేవాళ్ళం. ఇంకా చెప్పు, ఇంకా చెప్పు అనకుండా ఏ రాత్రీ గడిచేది కాదు.

నాలుగు తరాల విషయాలు, జ్ఞాపకాలు మాకు రోజూ కథలు. వాటిలోనే ఎన్నో విషయాలు తెలుసుకోవడం వల్ల మా జ్ఞానం ఎక్కువగా ఉండేది. అందుకే ఇలా చిన్నప్పటి విషయాలు అందరి ఇళ్ళల్లో పంచుకోవాలి. మీరు పంచుకుంటున్నారా?

**–విజయభాను కోటే**

~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~
~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~

# యుద్ధం ప్రతికూలతల మధ్యఉక్రెయిన్ భవిష్యత్తును రూపొందిస్తున్న ఇద్దరు మహిళలు (మహిళామణులు )–గబ్బిట దుర్గాప్రసాద్

Posted on April 1, 2025 by vihangapatrika

పూర్తి స్థాయి రష్యన్ దండయాత్రలో మూడు సంవత్సరాలకు పైగా, ఉక్రేనియన్ మహిళలు తమ యుద్ధ–ప్రభావిత సంఘాలను చురుకుగా పునర్నిర్మిస్తున్నారు. అపారమైన సవాళ్లు ఉన్నప్పటికీ, ఉక్రేనియన్ మహిళలు సానుకూల మార్పుకు నాయకత్వం వహించడంలో ఆశాజనకంగా దృఢ నిశ్చయంతో ఉన్నారు.

చెర్నిహివ్ మరియు ఖార్కివ్ ప్రాంతాలలో, బాంబుల , డ్రోన్ దాడులు కొనసాగుతున్నప్పటికీ, మహిళలు భద్రత, ఆశ నమ్మకాన్ని పెంపొందిస్తున్నారు. వారు స్థానిక నివాసితులకు మరియు అంతర్గతంగా స్థానభ్రంశం చెందిన వ్యక్తులు లేదా IDPలకు మద్దతు ఇస్తున్నారు, యువ తరంతో సహా మహిళలు పునరుద్ధరణ ప్రయత్నాలకు నాయకత్వం వహిస్తారని నిరూపిస్తున్నారు.

జకర్పట్టియా ఒబ్లాస్ట్‌లో మహిళా నాయకులు స్థానికులు మరియు IDPలు సమానంగా అవసరమైన సేవలను పొందగలిగే సమగ్ర సంఘాన్ని రూపొందించడానికి కృషి చేస్తున్నారు. పశ్చిమ ఉక్రేనియన్ ఒబ్లాస్ట్‌లో అక్టోబర్ 2024 నాటికి దాదాపు 66,000 IDP జనాభా ఉంది, IOM ప్రకారం, వారిలో ఎక్కువ మంది మహిళలు మరియు పిల్లలు.

ఉక్రెయిన్ భవిష్యత్తుపై కోలుకోవటం , ఆశ , నమ్మకాన్ని పునరుద్ధరించడానికి వారి సమాజాలలో పని చేస్తున్న దేశంలోని కొంతమందిగొప్ప మహిళలున్నారు .వారిలో ఇద్దరి గురించి తెలుసుకొందాం .

1– అన్నా షెర్బకోవా

చెర్నిహివ్ ఒబ్లాస్ట్‌లోని కేంద్రీకృత లైబ్రరీ సిస్టమ్ డైరెక్టర్ అన్నా షెర్బకోవా, ఆమె పర్యవేక్షిస్తున్న 24 లైబ్రరీలలోని వ్యక్తుల కోసం వనరుల కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉక్రెయిన్‌లోని యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (UNDP) మద్దతుతో, ఫ్రాన్స్ ప్రభుత్వ సహకారంతో సాధ్యమైంది, ఆమె ఉపాధిని కోరుకునే మహిళలను వారి స్వంత

వ్యాపారాలను ప్రారంభించడానికి వనరులతో అనుసంధానిస్తుంది, వారి స్వంత భవిష్యత్తును రూపొందించుకోవడానికి శక్తినిస్తుంది.

సరిహద్దు సమీపంలో నివసిస్తున్న, చెర్నిహివ్ ఒబ్లాస్ట్ నివాసితులు నిరంతరం ఆందోళన , భయంతో బతుకుతున్నారు . అయితే షెర్‌బకోవా యొక్క లైబ్రరీలు భద్రత, ఆశ సంవిధాన భావాన్ని అందిస్తాయి. లైబ్రరీ సిబ్బంది కౌన్సెలర్‌ల వలె వ్యవహరిస్తారు మరియు సంభాషణ ద్వారా మహిళలు మద్దతు మరియు ప్రేరణ పొందారు, "అని షెర్‌బకోవా వివరించారు.

సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ (SDGలు), గ్లోబల్ గోల్స్ అని పిలవబడేవి, పేదరికాన్ని అంతం చేయడానికి,భూ గ్రహాన్ని రక్షించడానికి ప్రజలందరూ మరియు శ్రేయస్సును ఆస్వాదించేలా చర్యలు తీసుకోవడానికి విశ్వవ్యాప్త పిలుపునిస్తున్నారు .చిన్న చిన్న ప్రయత్నాలు అద్భుత ఫలితాలిస్తాయి ..ప్రతి వారికిఆసరా, సంక్షేమం ,వారి ఆశయాలను నేరవేర్చుకొనే ప్రణాళిక లను అందించే చక్కని పర్యావరణం కల్పించటమే తమ విధానం అంటారు ఆమె ''.కోలుకోవటం అంటే పునర్నిర్మించటం మాత్రమె కాదు ఆశ ,నమ్మకాల పునరుద్ధరణ''అని గొప్ప అర్ధం చెప్పింది ,

2– అలియానా కంపానియట్స్

ఖార్కివ్ ఒబ్లాస్ట్‌లోని నోవా వోడోలాహా గ్రామంలోని హౌస్ ఆఫ్ కల్చర్ డైరెక్టర్‌గా ఉన్న 24 ఏళ్ల అలియోనా కంపానియెట్స్ సంస్కృతి మరియు కళల పట్ల ఎల్లప్పుడూ మక్కువ కలిగి ఉంటుంది . హౌస్ ఆఫ్ కల్చర్‌కు నాయకత్వం వహించే అవకాశం ఆమెకు లభించినప్పుడు, అలియోనా ఆసక్తిగా అంగీకరించింది. ఆశయం , ధైర్యమైన ఆలోచనలతో నిండిన ఆమె తన వృత్తి జీవితంలో కొత్త పేజీని మార్చడానికి సిద్ధంగా ఉంది. అయితే, యుద్ధం ప్రారంభం కావడంతో, ఆమె ప్రణాళికలు ప్రమాదంలో పడ్డాయి. కష్టతరమైన సమయాల్లో కూడా సంస్కృతి చాలా ముఖ్యమైనదని మరోసారి నిరూపించడానికి ఆమె తన పనికి కొత్త విధానాలను కనుగొనవలసి వచ్చింది.

''మొదట, ఇది భయపెట్టేది, సంస్కృతి 'ప్రాధాన్యత కాదు' అని అనిపించింది, కానీ ప్రజలకు మద్దతు ఇచ్చే శక్తి దానికి ఉందని నేను నమ్మాను."అన్నది . ఆమె బృందంతో కలిసి, కంపాని

యేట్స్ ఉక్రేనియన్ పాటలను కలిగి ఉన్న మ్యూజిక్ వీడియోలను రూపొందించడం ప్రారంభించింది, ఇది సమాజంలో త్వరగా మద్దతుని పొందింది, ఐక్యత , ఆశకు చిహ్నంగా మారింది.''యూక్రేయిన్ సంస్కృతీ మా జానపద గీతాలు ,కవిత్వం , కథలు తరతరాలుగా వస్తున్న సాహిత్య సంపద .అది మాకు తరగని గని .దాని పరిరక్షణే మా ధ్యేయం ''అంటుంది ఆమె .

మీడియా సెంటర్ అన్ని వయసుల మహిళలకు ఆలోచనలను మార్పిడి చేసుకోవడానికి, అనుభవాలను పంచుకోవడానికి , వారి సృజనాత్మక ప్రణాళికలను అభివృద్ధి చేయడానికి ఒక వేదికగా ఉపయోగపడుతుంది. జానపద సంప్రదాయాలను పరిరక్షించడానికి అంకితమైన స్థానిక మహిళల కథలను గుర్తించే "రిమార్కబుల్ ఉమెన్ ఆఫ్ నోవా వోడోలాహా" అనే ప్రాజెక్ట్ కీలకమైన కార్యక్రమాలలో ఒకటి.ప్రతి మహిళ లొ ఉన్న అంతర్గత భావాలకు విలువనిచ్చి ,ఆమె భావాలుసమాజాభి వృద్ధికి తోడ్పడేట్లు చేయటమే ఆమె లక్ష్యం .

మహిళల నాయకత్వం , బలమైన , మరింత సంఘటిత సంఘాలను నిర్మించే వారి సామర్థ్యాన్ని విశ్వసిస్తుంది.ఆమె . ఆమె దృష్టి అభివృద్ధి చెందుతున్న, సామరస్యపూర్వకమైన వనరులతో కూడిన సమాజం, ఇక్కడ సంస్కృతి అభివృద్ధికి పునాదిగా పనిచేస్తుందిఅని నమ్ముతోంది .''మేమంతా కలిసి మా సమాజాన్నిసృజనతో సంస్కృతితో ఒక ఆదర్శ సమాజంగా మార్చటమే లక్ష్యంగా పని చేస్తున్నాం. నేను సమగ్ర సేవా వ్యవస్థను రూపొందించడంలో సహాయపడాలని లక్ష్యంగా పెట్టుకున్నాను ''అంటుంది ఆమె .

–గబ్బిట దుర్గా ప్రసాద్

~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~
~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~

## నేను ఎవరు?( సమకాలీనం ) –బంగార్రాజు ఎలిపే

Posted on April 1, 2025 by vihangapatrika

భారత దేశంలో పూజింపబడే స్త్రీని. పూజకు అర్హత ఉంది కానీ నాకు స్వాతంత్ర్యం లేదు. నేను మీతో సమానం కాదు. ఎందుకంటే నేను స్త్రీని. నేను ఎంత చదువుకున్నా నా గురించి నేను నిర్ణయం తీసుకునే హక్కు నాకు లేదు. బాల్యంలో నాన్న నిర్ణయిస్తాడు. వివాహ బంధంలో భర్త నిర్ణయిస్తాడు. వృద్ధాప్యంలో కొడుకు నిర్ణయిస్తాడు. వాళ్ల నిర్ణయాధికారంలోనే నా జీవితం గడిపే స్త్రీని నేను. సమాజంలో చాలామంది నా స్వేచ్ఛ గురించి, హక్కుల గురించి మాట్లాడతారు. అప్పుడు నా గురించే కదా వీళ్ళంతా మాట్లాడేది అనిపిస్తుంది! అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చి 8 న అయిపోయిందిలే, ఆ రోజు కూడా నేను స్త్రీనని, నాకు కూడా సాధికారత ఉండాలని ఎంతో మంది పోరాటం చేస్తున్నారని అనిపిస్తుంది. నా కోసం నేనెప్పుడైనా పోరాటం చేశానా? పోరాడితే ఓడిపోతానని తెలుసు కనుక పోరాటం చేయడం లేదా? ఏమో!

నేను ఒక కథ చెబుతాను. నా లాంటి ఎందరిదో ఈ కథ! నాన్నకు నేనంటే చాలా ఇష్టం. ఎంతో ప్రేమగా పెంచారు. అడిగిందల్లా ఇచ్చారు. నేను పదో తరగతి పాస్ అయ్యాను చాలా హ్యాపీగా ఉంది. నాన్నా, నేను బైపిసి చదువుతాను అంటే నాన్న సరే అని చదివించాడు. తర్వాత అగ్రికల్చరల్ బీఎస్సీ చేస్తాను అంటే అది కూడా చదివించారు. కానీ అది పూర్తయిన తర్వాత నాన్న చదువు తర్వాతి ఘట్టం ఉద్యోగమని తెలుసుకోక, నాకు పెళ్లి చేశారు. నాకు కూడా అదే సరైన నిర్ణయం ఏమో అనిపించింది. అందరూ హ్యాపీ, నేను కూడా హ్యాపీ. సంవత్సరం అయింది, ఒక బాబు పుట్టాడు. మూడేళ్ళ తర్వాత ఒక పాప, ఆ తర్వాత వాళ్ళ ఆలనా పాలనా, నాదే బాధ్యత. ఒకరోజు తిరిగి వెనక్కి చూశాను...నాకు 50 సంవత్సరాలు వచ్చాయి. అప్పుడు నన్ను నేను ప్రశ్నించుకున్నాను, "నేను ఎవరిని?". చాలాసార్లు ఆలోచించాను నేను ఎవరిని అని, నాకు సమాధానం దొరకలేదు. ఇన్నాళ్ళూ నేను ఒక కూతురిని, ఒక భార్యని, ఒక తల్లిని. పిల్లలు ఎదిగిపోయారు, ఎగిరిపోయారు. భర్త ఉద్యోగంలో బిజీగా ఉన్నాడు. ఇంట్లో పనులు ఎన్ని చేసినా, ఇంకేదో నేను చేయాల్సింది చేయలేదని ఒకటే దిగులు. నాన్న కష్టపడి చదివించిన చదువు విలువ లేనిది అయిపోయింది, జీవితపు ఘట్టాల్లో ముఖ్యమైన ఘట్టాన్ని మరచి, తర్వాతి ఘట్టాన్ని చేరిన నేను నా ఉనికిని మర్చిపోయాను. ప్రభుత్వం నా మీద పెట్టిన ఖర్చు కు నేను రుణం తీర్చానా? మీరు అనవచ్చు నేను భార్యగా, తల్లిగా నా బాధ్యతలు నెరవేర్చాను కదా అని, కానీ నేను చదివిన చదువు, నాన్న కష్టం ,నా టీచర్స్ యొక్క ప్రోత్సాహం, నాకు ఇష్టమైన అగ్రికల్చర్ బీఎస్సీ ఏమైంది? నాపై

ప్రభుత్వం పెట్టిన ఖర్చు ఏమైంది? ఈ దేశ అభివృద్ధిలో నేను భాగం కాలేకపోయాను. నాకోసం ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టింది. నేను వాటిని వినియోగించుకున్నానా?

ఇప్పుడు ఇంకా ఎన్నో పథకాలు వచ్చాయి. బేటి బచావో బేటి పడావో, నా రక్షణ కోసం చట్టాలు, ఉజ్వల యోజన, స్వధార్ఘర్, ప్రధానమంత్రి మాతృ వందన యోజన. వన్ స్టాప్ సెంటర్ ఇలా అనేక రకాల పథకాలు ప్రవేశపెట్టి నన్ను సాధికారక మహిళగా నిలబెట్టాలని చూస్తోంది. కానీ నాకు దేశాభివృద్ధిలో భాగస్వామ్యం లేదు. నేను ఒక్కదాన్నే కాదు, మన దేశంలో చాలామంది స్త్రీలకు వారు ఎవరో వారికి తెలియదు. వారిపై వారికి హక్కులు ఉండవు. వారి పేరు మీద ఆస్తులు ఉంటాయి. కానీ వాటి హక్కులు మాత్రం వారివి కావు. ఎందుకంటే వారు స్త్రీలు. కాలు బయట పెట్టాలి అంటే అనుమతి అవసరం. ఎందుకంటే నేను స్త్రీని కదా! సమాజంలో మార్పు రానంత వరకు నేను ఎవరినో నాకు తెలియదు లేదా నేను మారేవరకు నేనెవరో నాకు తెలియదు. **(ఇది ఎంతో మంది మహిళల ఆవేదన)**

దేశ పౌరులలో దాదాపు సగం ఉన్న మహిళలు స్వేచ్ఛ, గౌరవం, సమానత్వం మరియు ప్రాతినిధ్యం కోసం పోరాటంలో ఎక్కడ ఉన్నారో అర్థం చేసుకుందాం. ఎంతో మంది స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్య వారిపై వారికి హక్కు లేకపోవడం. చాలామంది అంటూ ఉంటారు ఆడపిల్ల సంపాదించాల్సిన అవసరం లేదు అని. సంపాదన ముఖ్యమా? తన చదివిన చదువుకు సార్థకత చేకూర్చటం ముఖ్యమా? ఏది అవసరం. తను చదువుకున్నా, ఉద్యోగం చేస్తున్నా, పిల్లలను మరియు ఇంటి బాధ్యతను తనే చూడాలా? పిల్లల్ని మగవారు చూడలేరా? ఆలోచించండి బయటికి వెళ్లినా, ఎక్కడికి వెళ్ళినా, పిల్లల ఆలనాపాలనా చూసేదీ స్త్రీ మాత్రమే! ఇది నిజం.

ఈ మధ్య నా స్నేహితురాలు అమెరికా నుండి వచ్చింది. ఆమెతో జరిగిన సంభాషణలో, తాను ఒక్కత్తే అమెరికాలో తన భర్త దగ్గర పిల్లల్ని వదిలి వస్తే ఎంతో మంది అడిగే ప్రశ్నల గురించి చెప్పింది.

“పిల్లల్ని వదిలి వచ్చావా? వాళ్ళు ఎలా ఉంటారు నువ్వు లేకుండా? ఎవరు చూసుకుంటారు? వాళ్ళు ఉండగలరా? ఎలా వదిలేసి వచ్చావు?”

“నేను పిల్లల్ని వాళ్ళ నాన్న దగ్గర వదిలి వచ్చాను. పక్కింట్లో వదిలి రాలేదు. పిల్లలను తండ్రి చూసుకోవాలని ఎందుకు అనుకోరు? పిల్లలకు చేయాల్సిన పనులు తల్లి మాత్రమే చేస్తుందా? తండ్రి ఎందుకు చెయ్యడు?”

వాళ్ళిద్దరి మధ్యా ఎంతో సయోధ్య ఉంది. ఇద్దరూ బాధ్యతలు పంచుకుంటారు. అయినా సమాజపు భావజాలంలో మార్పు రాదు. ఆమె చెప్పిన సమాధానమే ప్రతి స్త్రీ చెప్పగలగాలి. వారిద్దరి మధ్య ఉన్న సయోధ్య ప్రతి ఇంట్లోనూ ఉండాలి. ఇటువంటి విషయాలను normalise చేసి తీరాలి.

కుటుంబ బాధ్యతలు సమానంగా ఉండాలి. భర్త చదివిన చదువుకు లభించిన గౌరవం, భార్య చదివిన చదివుకు లభిస్తే, నేను ఎవరు అని ప్రశ్నించుకునే అవసరం స్త్రీకి రాదు. ఆలోచించండి! చట్టాల వల్ల, ఉద్యమాల వల్ల రాని సమానత్వం ఇలా ఆలోచిస్తే వస్తుందేమో, ప్రయత్నిద్దామా?

స్త్రీల ఆవేదనను నేను వ్యక్తీకరించాను!

వారి భావోద్వేగాలు ఇలా ప్రతి పురుషునికి చేరితేనే మనలో మార్పు వస్తుంది!! కుటుంబాల్లో మార్పు వస్తుంది. పితృస్వామ్యపు భావజాలం అంతమౌతుంది!!

**–బంగార్రాజు ఎలిపే**

# కవి జోసఫ్ అధిక్షేపించిన దశపర్వాల – చెర్నాకోల శతకం (పుస్తక సమీక్ష )–డా.ఆర్. శ్రీనివాసరావు

Posted on April 1, 2025 by vihangapatrika

తెలుగు సాహిత్యంలో శతక ప్రక్రియకు ఒక ప్రత్యేకత ఉంది. అందులోను అధిక్షేప శతకం మరింత ప్రత్యేకమైనది. తెలుగులో ఆధిక్షేప శతకరచనకు అద్యుడు కవిచౌడప్ప. తర్వాత చెప్పకోదగిన వారిలో వేమన, కూచిమంచి సోదరులు, ఆడిదం సూరకవి కాగా ఆధునిక అధిక్షేప శతక రచనలో తిరుపతి వేంకటకవులు రాసిన  శాంకరీశతకము, ఏటుకూరి సీతారామయ్యగారి 'రామభద్రశతకము' శ్రీశ్రీ సిరిసిరిమువ్వ శతకము, విశ్వనాథ వారి పంచశతీ, నార్లవారి మంట మొదలైనవి.

ఈ కంప్యుటర్ యుగంలో శతక రచన చేస్తున్న అతికొద్దిమంది కవులలో జోసఫ్ ఒకరు. కవి జోసఫ్ అధిక్షేపించిన విషయములు నేటి సమాజఅభివృద్ధిని అడ్డుకునేవి. అందుకే వాటి అడ్డు తొలగించాలని తన చేతిలోకి శతకమనే 'చెర్నాకోల్'ను స్వీకరించి సమాజ ప్రగతిని పరుగులు పెట్టించాలని ఆశించారు. దానిని కొంతవరకు సాధించారు కూడా.

ఈ ' చెర్నాకోల శతకం'లో పది భాగాలున్నాయి. ఆ భాగాలను అది కావ్యం మహాభారతంలోని భాగాలకు పర్వాలు అని పేరు పెట్టినట్లుగా తన శతక భాగాలకు  పర్యాలు అని నామకరణం చేయడంలోని అర్థం  'అర్య వ్యవహారంబుల దృష్టంబు' అని ప్రాచీన కవుల బాటలోనే కవి జోసఫ్ కూడా నడిచారు.

ఈ శతకంలో ఉపాధ్యాయ పర్వం, వైద్య పర్వం, రక్షకభటపర్వం, స్త్రీపర్వం, సినిమా పర్వం, రాజకీయ పర్వం, బాబాల పర్వం, విద్యార్థిపర్వం, కుటుంబ పర్వం ప్రకీర్ణ పర్వం.

కవి జోసఫ్ వృత్తి అధ్యాపకత్వం. ప్రవృత్తి కవితారచన. అధ్యాపకునిగా ఎల్లప్పుడు నిత్య విద్యార్థి. అద్భుతంగా పాఠాన్ని బోధించినపుడు విద్యార్థులు ఎప్పుడు గుర్తుపెట్టుకుంటారు.

శిష్యశ్రేణి మనసు చిత్రంగ హరియించ

విషయ మెరుగువలెను ఋషియువోలె

పాఠ్యబోధనెపుడు పరమాన్న తుల్యమ్ము

గురువు నపుడు ఎవరు మరువగలరు ?

తిక్కన భారతంలో స్త్రీపర్వంలో స్త్రీల మనః ప్రవృత్తులను వర్ణించగా కవి జోసఫ్ నేటి యువతుల మానసికతను జోసఫ్ కవి ఇలా తెలుపుతున్నారు.

కురులు గాలికొదిలి మరులు గొలిపె

కురుచ దుస్తులేసి, కుర్రాళ్ల బైకుపై

తిరుగుతుంది యువతి తిక్కరేగి.................

సినీ పర్వంలో నేటి ప్రేక్షకులు, ఘంటసాల కంచు కంఠంబు, బాలు పాట, మైథిలాజికల్లు రామన్నలను చూడలేమంటారు. నేటి విలువలు లేని సినిమాను మేడిపండుతో పోల్చారు కవి జోసఫ్.

చిన్నయసూరి బాల వ్యాకరణంలో మిగిలిపోయిన అంశాలన్నీ కలిపి ప్రకీర్ణక పరిచ్ఛేధంలో ఉంచినట్లుగా కవి జోసఫ్ కూడా తాను చెప్పాలనుకున్న మిగిలిపోయిన అంశాలను ప్రకీర్ణక పర్వంలో ఉంచారు.

కవి జోసఫ్ ఈ 'చెర్నాకోల శతకం' ఒక ప్రయోగం చేశారు. మకుటమే లేని శతకం ఇది. మకుటం లేకుండా, శతక సంఖ్య లేకుండా రాయబడిన శతకం ఇది. ఈ దశ పర్వాల భాగాలకు శతకం అనే పేరు పెట్టడంలోని ఔచిత్యం పాఠకునికి అంతుబట్టదు.

ప్రకీర్ణక పర్వంలోని చివరి పద్యంలోని మొదటి పాదంలో 'చెళ్లుమనును ! చదువు చెర్నాకోల శతము' అని మాత్రమే ప్రయోగించబడింది.

జోసఫ్ కవి రాసిన 'చెర్నాకోల శతకం' ఆధిక్షేప రచనలో చక్కనైన శతకంగా అభివర్ణించవచ్చు. కవి జోసఫ్ కలం నుండి భూతకాలంలో హెల్మెట్ శతకం వెలువడగా, వర్తమానంలో 'చెర్నాకోల శతకం' భవిష్యత్తులో కరోనా శతకం రానుండటం అభినందిచ్చదగ్గ విషయం.

—డా॥శ్రీనివాసరావు .ఆర్.

మారీస్టెల్లా కళాశాల,విజయవాడ .

## జ్ఞాపకం – 105(ధారావాహిక ) – అంగులూరి అంజనీదేవి

Posted on April 1, 2025 by vihangapatrika

"అపార్ట్ మెంట్ ఎందుకవుతుంది బాబూ! సమాధినే! కాకపోతే మీ పెద్దనాన్న గారికి అంత ఘనంగా కుదురుతోంది. ఇదంతా ఆయన తెలిసో తెలియకో చేసిన మంచి పనుల ఫలితమేనయ్యా! లేకుంటే తల్లిదండ్రులతో అవసరం తీరాక వాళ్లకి అన్నం పెట్టాల్సి వస్తుందని గుట్టుగా యాక్సిడెంట్లు చేయించి చంపే కొందరు కొడుకులున్న ఈ రోజుల్లో మీ పెద్దనాన్న కడుపున ఆ బంగారు తల్లి పుట్టడమేంటి? 'ఎంత ఖర్చయినా ఫర్వాలేదు పోలయ్యా!' అంటూ వెనకాడకుండా డబ్బులు ఇవ్వడమేంటి? నిజంగా చెబుతున్నాను బాబు ఇలాంటి సమాధి మన చుట్టుపక్కల మండలాల్లో ఎక్కడా లేదనుకో!" అన్నాడు.

ఆ మాటలు వింటుంటే అతని మనసును సూదులతో గుచ్చినట్లయింది.

"ఆ డబ్బుల్లో ఎంత ముడుతుందేం నీకు?" అన్నాడు.

పోలయ్యకు చురుక్కుమంది "నాకెందుకు బాబు ఆ ముడుపులు? ఇదేమైనా మీరు చేస్తున్న కాంట్రాక్ట్ పని లాంటిదా? ఏదో ప్రేమతో చేస్తున్న పని" అన్నాడు.

"ఎంత ప్రేమ వుంటే మాత్రం నువ్వు పగలే కాకుండా రాత్రిళ్లు కూడా ఇక్కడే పడుకుంటున్నావట కదా?" అడిగాడు.

"లేకుంటే సిమెంట్ బస్తాలు, ఐరన్, కంకరా, ఇసుక, ఇటుకలు వుంటాయా బాబూ! తెల్లారేసరికి మాయమైపోవూ! ఇలాంటి మెటీరియల్ ఎక్కడ దొరికినా దొంగతనంగా పట్టుకెళ్లి ఇళ్లకి వాడుకుంటున్నారు. మీకు తెలియందేముంది?" అన్నాడు.

అతను గతుక్కుమన్నాడు. తను చేస్తున్న కాంట్రాక్ట్ వర్క్ దగ్గర నుండి దొంగతనంగా ఇలాంటి మెటీరియల్ ని లారీలలో చేరవేసుకొని మూడో ఇల్లు కట్టుకున్నాడు. మొన్ననే గృహప్రవేశం కూడా జరిగింది..

"ఇక చాల్లే! కట్టినకాడికి. త్వరగా సిమెంట్ పూసి వదిలెయ్యండి! ఎందుకాపారు?" అన్నాడు సమాధినే చూస్తూ,

"ఆపలేదు బాబు! సమాధి చుట్టూ, సమాధికి మార్బుల్స్ వెయ్యాలని లేఖమ్మగారు అన్నారు. అవిగో మార్బుల్స్ ట్రాలీ ఆటోలో రానే వస్తున్నాయి" అంటూ ఆటోకి ఎదురెళ్లబోయాడు పోలయ్య.

“ఆగు పోలయ్యా!” అనగానే ఆగాడు పోలయ్య.

“మార్బుల్స్ సమాధికి అవసరమా? మనుషులు వుండే ఇళ్లకే మార్బుల్స్ లేవు. అయినా ఈ పొలంలో వాటికి ఎవరు కాపలా కాస్తారు?” అన్నాడు. మార్బుల్స్ వేస్తే ఆ సమాధి ఇంకా హైలైట్ అవుతుందన్న అసూయ ప్రారంభమైంది అతనిలో. వైట్ & వైట్ డ్రెస్ లో వున్న అతన్ని చూడగానే దారినవెళ్లే వాళ్లు ఆగి ‘నమస్తే అన్నా!‘ అని చెప్పి వెళ్తున్నారు. పోలయ్య కళ్లకి ఆటోలో కన్పిస్తున్న మార్బుల్స్ తెల్లగా కన్పించి కనువిందు చేస్తున్నాయి. ‘వీటిని గనక సమాధికి వేస్తే సమాధి అదిరిపోద్ది‘ అని మనసులో అనుకుంటూ వాటినే ఆశగా చూసాడు. “తండ్రి సమాధికి వీటిని వేయించుకోవాలని లేఖమ్మ కోరిక బాబు! నేను కాపలా కాస్తాను” అన్నాడు గుండెల మీద ఆనందంగా చేత్తో కొట్టుకుంటూ .

“గుండె పగిలి ఇప్పుడే చచ్చేలా వున్నావ్! మొన్న మా మరదలు వినీల అంటుంటే విన్నాను. మా పెద్దనాన్న ఎవరికో ఒంట్లోకి వచ్చి చెప్పాడట. ‘పోలయ్య నా మిత్రుడు, నా సమాధి పూర్తయ్యేలోపలే అతన్ని నా దగ్గరకి తీసికెళ్తాను‘ అని... ఈ వార్త నీదాకా రాలేదా?” అడిగాడు పోలయ్య కళ్లలోకే సూటిగా, భయపెడ్తున్నట్లు చూసి.

పోలయ్య ఆశ్చర్యపోతూ వినీలమ్మ ఇలా కూడా ప్రచారం చేస్తోందా? రాజారాంని కూడా ‘మీరు సమాధి వైపు వెళితే వూరుకోను. నేరుగా స్కూల్ కి వెళ్లి తిన్నగా ఇంటికి రండి! ఆ చెండాలం మనకెందుకు? అక్కడకెళితే ఆత్మలు వెంటబడతాయట. ఆ లేఖకేదో తలమీద కూర్చుని ఇలాంటి పనులు చేస్తోంది. లేకుంటే తండ్రికెక్కడైనా ఆడపిల్ల సమాధి కట్టిస్తుందా?’ అని భయ పెట్టి కట్టడి చేసిందట. పోలయ్య అది గుర్తుచేసుకున్నాడు.

“రాఘవరాయుడి ఆత్మ తీసికెళ్తే వెళతానులే బాబూ! ఇక్కడ వుండి మాత్రం చేసేదేముంది? ఇదిగో ఈ ఒక్క పని పూర్తి చేసి పోతే లేఖమ్మను సంతోషపెట్టినట్లవుతుంది. నేను పొయ్యాక ఇదిగో ఈ సమాధిని మొద్దు పోలయ్య దగ్గరుండి కట్టించాడన్న పేరు మిగిలిపోతుంది” అన్నాడు.

“పేరు ముచ్చట సరే! ఈ రాత్రికే నీ తల పగిలిపోతుందేమో చూడు! ఎక్కడా ఆ సమాధి మీదనేనా నువ్వు పడుకునేది?” వేలు చూపిస్తూ అడిగాడు.

పోలయ్య బెదిరిపోయాడు “అవును బాబు! అక్కడే! పడుకోగానే హాయిగా నిద్రపడుతుంది. తమరేమైనా నా తల పగలగొట్టే ఏర్పాట్లు చేసివుంచారా?” అన్నాడు. అప్పటివరకు నిబ్బరంగా మాట్లాడిన పోలయ్యకు వెన్నులో జలదరింపు కలిగింది.

“ఛ... ఛ.. అలాంటి పనులు నేను మానేశాను పోలయ్యా! మన చుట్టుపక్కల పల్లెల్లో ఎవడో సైకో తిరుగుతున్నాడట! ఇప్పటికి నలుగుర్ని చంపేశాడట! ఇంతకుముందే టీ.వీ. న్యూస్ లో చూశాను. బ్రేకింగ్ న్యూస్ కింద దాన్నే హైలైట్ చేసి చూపిస్తున్నారు. పొలం కదా! ఎందుకైనా మంచిది ఈ రాత్రికి ఊళ్లోకి వచ్చి పడుకో” అన్నాడు.

ఆలోచనలో పడ్డాడు పోలయ్య. సైకో మన పల్లెల్లో తిరుగుతున్నాడా? నిజమా!!

“అయినా ఆ సైకో ఆడవాళ్లను కదా చంపేది? నన్నేం చేస్తాడు? నేనిక్కడే పడుకుంటాను” అన్నాడు..

“నీ ధైర్యం పెద్దది పోలయ్యా! కానీ ఆ సైకో ఆడవాళ్లనే కాదట. అర్ధరాత్రి మగవాళ్లు కన్పించినా తల పగలగొట్టి పరారవుతున్నాడట. చూడటానికి చాలా వికారంగా, గుండేసుకొని తిరుగుతుంటాడట” అంటూ అతను వెళ్లిపోయాడు.

“ఓరినాయనో ఇవాళ పోలయ్యకు మూడింది” అనుకున్నారు అక్కడవాళ్ల సంభాషణ విన్నవాళ్లు.

ఏం చేయాలో తోచక మొద్దు పోలయ్య గుండె గొంతులోకి వచ్చినట్లైంది.

—— అంగులూరి అంజనీదేవి

~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~
~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~

# పద్మభూషణ్ బోయి భీమన్న జీవితం– సాహిత్యం జాతీయ సాహిత్య సదస్సు – విహంగ పత్రిక

Posted on April 1, 2025 by vihangapatrika

రాజమహేంద్రవరం వై జంక్షన్ ఆనం కళా క్షేత్రంలో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ(రాష్ట్ర సృజనాత్మక మరియు సంస్కృతి సమితి)సౌజన్యంతో… తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్,భీమన్న సాహితీ నిధి ట్రస్ట్ మరియు శ్రీశ్రీ కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో "మహాకవి, కళాప్రపూర్ణ, పద్మభూషణ్ బోయి భీమన్న జీవితం – సాహిత్యం" జాతీయ సాహిత్య సదస్సు National Literary Seminar జరిగింది.

మార్చి 23 ఆదివారం– 2025 వేదిక: ఆనం రోటరీ హాలు –రాజమహేంద్రవరం నందు జరిగిన సెమినార్ లో బోయి భీమన్న గారి సతీమణి బోయి హైమావతి, డా.టి.పార్థ సారథి మరియు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సహాయ ఆచార్యులు డా.తరపట్ల సాత్యనారాయణ,శ్రీ శ్రీ కళావేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు డా.కత్తి మండ ప్రతాప్,శ్రీమతి కొల్లి రమాదేవి,కవి బి.వి.వి.సత్యనారాయణ, అంతర్జాతీయ ఫిలాంత్రోఫిక్ సొసైటీ అధ్యక్షుడు డా.అద్దంకి రాజయోనా గార్ల చేతుల మీదుగా 'బోయి భీమన్న నాటక రచనలు–కుల నిర్మూలన,భారతీయ సమైక్యతా భావం'.అనే అంశం పై పత్ర సమర్పణ చేసిన వెంకటేశ్వరరావు కట్టూరి కి చిరు సత్కారం.

–విహంగ పత్రిక

## సంస్కృతాంధ్ర నాటక సాహిత్యం – జాతీయ సదస్సు

Posted on April 1, 2025 by vihangapatrika

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం తెలుగు & ప్రాచ్య భాషా విభాగం మరియు యు.జి.సి. సౌజన్యంతో జాతీయ సదస్సు 21,22 మార్చి 2025 (శుక్ర, శనివారములు) నిర్వహించారు. తెలుగు & ప్రాచ్య భాషా విభాగం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఆచార్యులు,డా.ఎన్.వి. కృష్ణారావుగారు ఈ సదస్సుకు సంచాలకులుగా వ్యవహరించారు.

ఈ జాతీయ సదస్సుకు ఏలూరు జిల్లా, చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తెలుగు శాఖాధ్యక్షులు డా.గౌరారపు శ్రీనివాస్ గారు పాల్గొన్నారు. తన పరిశోధన పత్రాన్ని సమర్పించారు. తర్వాత సదస్సు సంచాలకులు ప్రశంసా పత్రాన్ని అందించారు.

–విహంగ పత్రిక

## 'మహాప్రస్థానం' అమృతోత్సవం – మహాకవి శ్రీశ్రీ సాహిత్య సమాలోచనం అంతర్జాతీయ సదస్సు

Posted on April 1, 2025 by vihangapatrika

ఆంధ్ర లొయోల (స్వయంప్రతిపత్తి) కళాశాల విజయవాడ వారి  తెలుగు, హిందీ, సంస్కృత శాఖలు సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ సదస్సు 18,19 మార్చి 2025 రెండు రోజుల నిర్వహించటం జరిగింది. 1000 ఏళ్ళ తెలుగు సాహిత్యంలోని భిన్న దృక్పదాలు మీద ఆంధ్ర లొయోల కళాశాల విజయవాడ ప్రాచ్య శాఖలు అనేక సదస్సులు నిర్వహించాయి. అదే సంప్రదాయాన్ని అనుసరిస్తూ "మహాప్రస్థానం" ప్రచురించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆంధ్ర లొయోల కళాశాల ఈ అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. రెండవ రోజున మన విహంగ జర్నల్ సంపాదకురాలు డా.యస్.జ్యోత్స్నరాణి గారు శ్రీశ్రీ కవిత్వంలో ఎలిజీలు అనే పరిశోధనా పత్రాన్ని సమర్పించారు.

–విహంగ పత్రిక

## ప్రముఖ రచయిత్రి యలమర్తి అనురాధకు ఉగాది పురస్కారం

అల్లాపూర్ డివిజన్ గాయత్రీ నగర్ కు చెందిన ప్రముఖ రచయిత్రి యలమర్తి అనురాధకు విశేష గౌరవం దక్కింది. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా యలమర్తి అనూరాధ తాను సాహితీ రంగానికి చేసిన విశేష సేవలకు గాను ఉగాది పురస్కారం అందుకున్నారు. ఇదే వేదికన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పై అప్పటికప్పుడు ఆమె చెప్పిన కవిత పలువురుని ఆకర్షించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆరేళ్ల విరామం తర్వాత ఉగాది పురస్కారం సాహిత్యం, సంగీతం, నృత్యం, చిత్రకళ, శిల్పకళ, నాటక, జానపద కళలు, అవధానం, మిమిక్రీ, హరికథ, జర్నలిజం, వైద్య సేవలు, సామాజిక, సేవా రంగాల్లో విశేష సేవలు అందించిన వారికి గుర్తింపుగా ఈ పురస్కారాలను ఏపీ ప్రభుత్వం అందజేస్తుంది. ఉగాది పురస్కారం ఈ సం// 116 మందిని ఎంపిక చేయగా అందులో అనురాధకు చోటు దక్కింది. విజయవాడలోనే తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో కళాకారులను శాలు వాళ్లతో సత్కరించి పదివేల రూపాయలు నగదు, పురస్కారంతోపాటు తెలుగు తల్లి జ్ఞాపికను చంద్రబాబు అందించారు. విశ్వా వసు నామ ఉగాది పురస్కారానికి యలమర్తి ఎంపిక కావడం ఎంతో ఆనందదాయకమని తన 50 ఏళ్ల సాహిత్య పరిశ్రమకు ఫలితం ఫలం, ఫలితం దక్కిందని అను అనూరాధ పేర్కొన్నారు.

–విహంగ పత్రిక

~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~
~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~~